కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ బుధవారం 19 మార్చి 2025
సంపుటి: 14, సంచిక: 346 పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు



ఎల్బీనగర్ మార్చ్ 18 (నిఘా న్యూస్): ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయింది. హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ఎల్బీ నగర్ పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు.



ప్రధాని మోడీతో
ఇళయారాజా భేటీ 2

# సునీత క్షేమంగా తిరిగి రావాలి



### భారత్‌లో పర్యటించాలని ఆకాంక్షిస్తున్నాం.. సునీతా విలియమ్స్‌కు మోడీ లేఖ

న్యూఢిల్లీ మార్చి18 (నిఘా న్యూస్): భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ కొన్ని నెలల ఎదురుచూపుల తర్వాత పుడమికి తిరిగి వస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందించారు. మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురు చూస్తున్నాం అని సునీతకు లేఖ రాశారు. ఆమె సురక్షితంగా భూమిపైకి తిరిగిరావాలని, ఆరోగ్యంగా ఉండాలని మోదీ ఆకాంక్షించారు. సునీత సాధించిన విజయాల పట్ల 140 కోట్లమంది భారతీయులు గర్వంగా ఉన్నారని పేర్కొన్నారు. యూఎస్ పర్యటనకు వెళ్లినప్పుడు మీ గురించి అడిగి తెలుసుకున్నాను. మీరు వేలాది కి.మీ.దూరంలో ఉన్నప్పటికీ, మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు. మీ అంతరిక్షయాత్ర విజయం సాధించాలని మేమంతా కోరుకుంటున్నాం. మీరు తిరిగి వచ్చిన తర్వాత మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురు చూస్తున్నాం. తన కుమార్తెలకు ఆతిథ్యం ఇవ్వడం పట్ల భారత్ సంతోషంగా ఉంటుందని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. మార్చి ఒకటిన రాసిన లేఖను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఈ లేఖ పట్ల సునీత సంతోషం వ్యక్తంచేశారు. దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సునీతా విలియమ్స్, వ్యోమగామి బుచ్ విల్మోర్, మరో ఇద్దరు ఆస్ట్రోనాట్‌లతో కలిసి వారు భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారు జామున 3.27 గంటలకు పుడమికి చేరుకుంటారని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రకటించిన విషయం తెలిసిందే. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు ..మిగతా 2లో

## ఉపాధి హామీని నీరుగార్చిన బీజేపీ



### రాజ్యసభలో సోనియా ఆవేదన

న్యూఢిల్లీ మార్చి18 (నిఘా న్యూస్): ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం బలహీనపరచడం బాధాకరం అని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ సోనియా గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై రాజ్యసభలో సోనియా మాట్లాడారు. ప్రస్తుత ..మిగతా 2లో

# హైడ్రా పేరుతో బెదిరించి... కాంగ్రెస్ వసూళ్లు

### గ్యారంటీలను గాలికి వదిలేసి, ప్రశ్నించిన వారిని జైలుకు పంపుతున్నారు

- ఆర్థిక శక్తిగా ఎదిగిన రాష్ట్రాన్ని ఆగం చేసి పేద అరుపులు
- పేదలపై ప్రతాపం చూపించి పెద్దలతో ఒప్పందాలు
- హైడ్రా నోటీసులు వచ్చి మౌనవ్రతం పాటించడంపై అనుమానాలు
- ఫార్మా సిటీ పేరుతో భూములను చెరబట్టారని ఆగ్రహం
- మద్యం ధరల సవరణ, కొత్త బ్రాండ్ల పేరుతో అక్రమ ఒప్పందాలు
- క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఒట్టి బోగస్
- ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

ఫోర్త్ సిటీ సాకుతో సీఎం రేవంత్ రెడ్డి కుటుంబం రియల్ ఎస్టేట్ వ్యాపారం



విషయం లేక విషం కక్కుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ మార్చి 18 (నిఘా న్యూస్): హైడ్రా పనితీరుపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఆ సంస్థ కాంగ్రెస్ సర్కార్‌కు చెడ్డపేరు తెస్తోందని, ఓ వైపు హైడ్రా పేరుతో నోటీసులు ఇస్తున్నారని కానీ, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని ఆయన అసెంబ్లీ లాబీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. హైడ్రా పేరుతో ప్రభుత్వంలోని పెద్దలు వసూళ్ల దందా చేపడుతున్నారని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లపై పగబట్టారని, ఫార్మా సిటీ పేరుతో భూములను చెరబట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఫోర్త్ సిటీ సాకుతో సీఎం రేవంత్ రెడ్డి కుటుంబం ఏకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలు పెట్టిందని అన్నారు. రిజినల్ రింగ్ రోడ్డు పేరుతో భూములను ..మిగతా 2లో



## దళితులను ముందు వరసలో నిలిపిన కాంగ్రెస్

### ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

### వర్గీకరణ బిల్లుపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ మార్చి 18(నిఘా న్యూస్): ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్రంలో వివిధ శాఖల బాధ్యతలు అప్పగించి గౌరవించింది. దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్యను సీఎంగా చేసింది కాంగ్రెస్ పార్టీ. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగింది. దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. ఇన్నాళ్లకు నేను సీఎంగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం సంతోషకరం. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ..మిగతా 2లో

## కుంభమేళా మృతులకు నివాళి ఏదీ!

ప్రధాని మోడీపై విపక్షనేత రాహుల్ విసుర్లు 2



## విశాఖలో ఏఐ, స్పోర్ట్స్ యూనివర్సిటీలు

### ఎన్‌సీసీకి సంబంధించి ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు

### ప్రైవేట్ విశ్వవిద్యాలయాల సవరణ బిల్లుపై చర్చలో లోకేశ్

అమరావతి మార్చి 18(నిఘా న్యూస్): విశాఖలో ఏఐ స్పోర్ట్స్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. 2016లో ప్రైవేట్ యూనివర్సిటీల బిల్లు తీసుకొచ్చామని, అందులోని లోపాలు సరిదిద్ది కొత్త చట్టం తెస్తామన్నారు. ఎన్‌సిసీకి సంబంధించి ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటుపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చించామన్నారు. యువగళం పాదయాత్రలో చేనేతలో కష్టాలు ప్రత్యక్షంగా చూశానని, చేనేత కళాకారులకు ఉచిత విద్యుత్‌కు క్యాబినెట్ ఆమోదం సంతోషాన్నిచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ఏపీ అసెంబ్లీలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు 2025ను మంత్రి లోకేష్ సభలో ప్రవేశపెట్టారు. బిట్స్ ప్రాంగణాన్ని అమరావతిలో ఏర్పాటు కోసం 70 ఎకరాలను కేటాయిస్తూ నిన్న కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నాం. డీప్ టెక్ విశ్వవిద్యాలయాన్ని ..మిగతా 2లో

## అసెంబ్లీలో... పారిపోయిన కాంగ్రెస్

### అసెంబ్లీలో క్వశ్చన్ హవర్ ఉండడం మాండిటరీ
### భూములు తాకట్టుపెట్టి వేలకోట్లు అప్పు
### సభా హక్కులను కాపాడే బాధ్యత స్పీకర్‌దే
### ఆంధ్రా జలదోపిడీతో నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు నీటి సమస్య
### చిట్‌చాట్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్ మార్చి18(నిఘా న్యూస్): శాసనసభలో ప్రశ్నోత్తరాలపై సమాధానం చెప్పలేక కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. అందుకే ఈరోజు కీలకమైన ప్రశ్నోత్తరాలు ఉన్నాయని సమాధానం చెప్పలేక రద్దు చేసుకుందని విమర్శించారు. దీనిపైన స్పీకర్‌కు, కార్యదర్శికి అభ్యంతరం చెప్పామని హరీశ్‌రావు ..మిగతా 2లో

## మూసీపై వెనకడుగు లేదు


### అపోహలు ఉంటే వివరణ ఇస్తాం: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్ మార్చి18 (నిఘా న్యూస్): మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమానికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఎవరికైనా అపోహలుంటే నివృత్తి చేస్తామని చెప్పారు. మూసీ పునరుజ్జీవన కార్యక్రమంపై శాసనమండలిలో సభ్యులు మహేశ్ కుమార్ గౌడ్, టి.జీవన్ రెడ్డి, బల్మూరి వెంకట్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. మూసీ ఒడ్డున ఉంటున్న పేదలు, మధ్య తరగతి ప్రజల కోసమే ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. వాళ్లు ఇతరులను నమ్మి మోసపోయారని గుర్తించి వారికి ప్రత్యామ్నాయం ..మిగతా 2లో

## నేడు అసెంబ్లీలో తెలంగాణ బడ్జెట్

### కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది రెండవ బడ్జెట్



హైదరాబాద్ మార్చి18(నిఘా న్యూస్): తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టనుంది. రాష్ట్ర ఆర్థిక మంత్రి ..మిగతా 2లో

## జగన్, కేసీఆర్‌లు ఆర్థిక నేరగాళ్లు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణిలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి 2

# దళితులను ముందు వరసలో నిలిపిన కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి...

నిర్ణయం ప్రకటించాం. వెంటనే ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించాం. మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ నియమించాం. కమిషన్ ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించింది. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించాం. 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించింది. 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫార్సులు చేసిందని సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటానికి గొప్ప విజయం లభించింది. ఇక, ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్య్ర వచ్చినప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ దళితులకు అండగా ఉంటోంది. దశాబ్ధాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరుగుతోంది. ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. బిల్లును ఎకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు నా కృతజ్ఞతలు. నేను ముఖ్యమంత్రిగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం సంతోషం' అని అన్నారు. బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో ఎస్సీ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం



జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్ సిఫార్సు చేసిన ప్రకారమే 3 గ్రూపులతో ఎస్సీ వర్గీకరణ బిల్లును రూపొందించింది. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్ 1లో చేర్చారు. మొత్తం జనాభాలో వీరి జనాభా 3.288గా ఉంది. వీరికి ఒక శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు.

మధ్యస్థంగా లబ్ధిపొందిన 18 కులాలను గ్రూప్ 2లో చేర్చారు. వీరి జనాభా 62.748గా ఉంది. వీరికి 9శాతం రిజర్వేషన్ కల్పించారు. కాస్త మెరుగైన ప్రయోజనాలు పొందిన 26 కులాలను గ్రూప్ 3లో వేశారు. వీరి జనాభా 33.963గా ఉంది. వీరికి 5 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఏ,బీ,సీ,డీ, కేటగిరీలుగా ఎస్సీ వర్గీకరణను చేసే అవకాశం లేదని కమిషన్ స్పష్టం చేసింది. ప్రభుత్వం కమిషన్ సిపార్సుతో పాటు- ఎపిరికల్ డేటాను దృష్టిలో పెట్టుకుని న్యాయపర చిక్కులు రాకుండా ఉండేలా బిల్లును సిద్ధం చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ జనాభా 1,38,78,078. వీరిలో మాదిగలు 67,02,609 ఉండగా.. మాలలు 55,70,244 మంది ఉన్నారు. ఈ లెక్కల ప్రకారం మాలల జనాభా కంటే మాదిగల జనాభా 11.3 లక్షలు ఎక్కువ. ఎస్సీల్లో కేవలం ఈ రెండు కులాల జనాభానే 80 శాతం వరకు ఉంటుందని ఓ అంచనా. అందరికీ కలిపి 15 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఈ మొత్తం కోటాలో మాలలే ఎక్కువ లాభం పొందుతున్నారనే గొడవ దశాబ్దాల క్రితమే మొదల్కొంది. 1972 నుంచి మాదిగ వర్గానికి చెందిన నేతలు ముఖ్యమంత్రులను కలుస్తూ వినతి పత్రాలు ఇస్తూ వచ్చారు. మంద క్రిష్ణ మాదిగ కూడా దీనిపై ఎప్పటినుంచో మాట్లాడుతున్నారు. 1996 నాటికి మాదిగలు 18 వేల ఉద్యోగాల్లో ఉండగా, వాటిలో 80-90 శాతం నాల్గో తరగతి ఉద్యోగాలే. మరోవైపు, మాలలు అన్ని రకాలవీ కలిపి 72 వేల ఉద్యోగాల్లో ఉన్నారని అన్నారు.



## ప్రధాని మోడీతో ఇళయారాజా భేటీ

న్యూఢిల్లీ మార్చి 18(నిఘా న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీని ప్రముఖ సంగీత దర్శకుడు,రాజ్యసభ సభ్యుడు ఇళయరాజా మర్యాదపూర్వకంగా కలిశారు. సంబంధిత ఫొటోలను మ్యూజిక్ డైరెక్టర్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. మోదీజీతో ఎప్పటికీ మర్చిపోలేని సమావేశమిది. నా 'సింఫొనీ- వాలియంట్' సహా పలు అంశాలపై చర్చించాం. ఆయన ప్రశంసలు, మద్దతుకు కృతజ్ఞుడినని పేర్కొన్నారు. లండన్లో ఇటీవల ఇళయరాజా 'వాలియంట్' పేరిట మ్యూజికల్ ఈవెంట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. లండన్లో వెస్టర్న్ క్లాసికల్ సింఫొనీ నిర్వహించిన తొలి ఆసియా మ్యూజిక్ కంపోజర్గా ఇళయరాజా రికార్డు సృష్టించారు. కొన్ని రోజుల క్రితం చెన్నై తిరిగొచ్చిన ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సంగీతానికి వయసుతో సంబంధంలేదన్నారు. భవిష్యత్తులో 13 దేశాల్లో 'వాలియంట్' నిర్వహించనున్నారు.



## ఉపాధి హామీని నీరుగార్చిన బిజెపి

మొదటి పేజీ తరువాయి...

బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని క్రమపద్ధతిలో బల హీనపరచడం చాలా ఆందోళనకరం అని తెలిపారు. బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 86 వేల కోట్లు స్తబ్దుగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పథకం బహుళ సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. వేతన చెల్లింపుల్లో నిరంతరం జాప్యాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అలాగే ప్రస్తుతం చెల్లిస్తున్న నగదు కూడా సరిపోదని, దాన్ని రూ.400 కనీస వేతనంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సకాలంలో వేతనం ఇవ్వకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని సభ దృష్టికి సోనియా తీసుకొచ్చారు. ఇక పథకాన్ని మరింత విస్తరించడానికి తగినంతగా బడ్జెట్లో కేటాయింపులు చేయాలని కేంద్రాన్ని సోనియా కోరారు.



## మూసీపై వెనకడుగు లేదు

మొదటి పేజీ తరువాయి...

ఏర్పాటు చేస్తున్నం. తెలిసి తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవు. తెలియకుండా ఇబ్బంది పడుతున్న వారికి తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. గంగానది, సబర్మతి నది పునరుజ్జీవం కార్యక్రమానికి ఇచ్చినట్లు- మూసీ నదికి కూడా నిధులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే అనేక సార్లు సీఎం కూడా కోరారని చెప్పారు. కానీ కేంద్ర ప్రభుత్వం గుజరాత్, యూపీలపై చూపిస్తున్న ప్రేమ తెలంగాణ రాష్ట్రంపై చూపించడం లేదని విమర్శించారు. ప్రజలకు కాలుష్యం లేని నీళ్లు, గాలి అందించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. ఈ విషయంలో విపక్షాలు మంచి సలహాలు ఇస్తే స్వీకరిస్తామన్న మంత్రి, రాజకీయాలు చేయొద్దని సూచించారు.

## జగన్, కేసీఆర్‌లు ఆర్థిక నేరగాళ్లు

నంద్యాల మార్చి 18 (నిఘా న్యూస్): జగన్ దోపిడీ వల్లనే ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి కుంటుపడుతోందని, సీఎం చంద్రబాబు చాక చక్యంతో, ఆయన అనుభవంతో ఆర్థిక కష్టాల నుంచి అతి కష్టంగా బయటపడుతున్నాడని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి నివాసంలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ద్వారా మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను భాధితులు కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన గంధం మహేశ్వరీ కి రూ. 1,06,874 లక్షలు, బండి ఆత్మకూరు మండలం ఏ. కోడూరు గ్రామానికి చెందిన దూదేకుల రఫీక్ కు రూ. 1,24,076 లక్షల చెక్కులను బాధితులకు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పంపిణి చేశారు. ఈ సందర్బంగా బైరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా, బహిరంగంగా తెలంగాణ ఆర్థిక కష్టాలకు 10 ఏళ్ల కేసీఆర్ పాలనలోని దోపిడే కారణం అని ప్రకటించారని, ఇది ముమ్మాటికీ నిజం అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో జగన్ పాలనలో పంచభూతాలను వదలకుండా దోపిడీ చేశారని, ఆయన చేసిన అప్పులు, వాటికీ వడ్డీ చెల్లించలేక, అభివృద్ధి, సంక్షేమ పథకాలు ముందుకు తీసుకెళ్లలేక సీఎం చంద్రబాబు అనేక ఇబ్బందులు పడుతున్నారని బైరెడ్డి వివరించారు. జగన్, కేసీఆర్ లు తోడు దొంగలు, ఆర్థిక నేరగాళ్లు అని, రెండు తెలుగు రాష్ట్రాల ఆర్థిక సంక్షోబానికి వీరిద్దరు కారణం అని బైరెడ్డి పేర్కొన్నారు.



## విశాఖలో ఏఐ, స్పోర్ట్స్ యూనివర్సిటీలు

మొదటి పేజీ తరువాయి...

ఏర్పాటు- చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళిక చేస్తున్నారు. విశాఖలో ఏఐ, స్పోర్ట్స్ యూనివర్సిటీలు ఏర్పాటు- చేసే చేయాలని ప్లాన్ చేస్తున్నాం. 2016లో ప్రైవేట్ యూనివర్సిటీ- బిల్లును తీసుకొచ్చాం. అందులో కొన్ని లోపాలు ఉన్నాయి, వాటిని సరిదిద్ది సరికొత్త చట్టాలను తెస్తాం' అని మంత్రి నారా లోకేష్ చెప్పారు.స్కూళ్లలో ఎన్సీసీతో పాటు- ప్లే గ్రౌండ్స్, ప్రైవేట్ స్కూళ్లలో మౌలిక వసతులపై సభ్యుల ప్రశ్నలకు అసెంబ్లీలో మంత్రి నారా లోకేష్ సమాధానాలు ఇచ్చారు. ఎన్సీసీకి సంబంధించి ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు-పై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చించామని, త్వరలో ఈ అంశానికి సంబంధించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో మౌలిక వసతులు, ఇతర అంశాలపై మానిటరింగ్ జరుగుతోందని మంత్రి లోకేష్ బదులిచ్చారు. విద్యకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. గతంలో విశాఖలో సెంచూరియన్ యూనివర్సిటీ ఏర్పాటు అయ్యిందన్నారు. ప్రైవేటు యూనివర్సిటీల సంస్థాగత మార్పులకు ఉద్దేశించి ఈ సవరణ బిల్లును తీసుకువచ్చామన్నారు. రాష్ట్రంలో విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటు- కోసం కూడా ప్రయత్నం చేస్తామని మంత్రి తెలిపారు. ప్రతిష్ఠాత్మక బిట్స్ పిలానీ సంస్థకు అమరావతిలో 70 ఎకరాలు కేటాయించామని, టాటా లాంటి సంస్థలు కూడా వస్తున్నాయని వివరించారు. డీప్‌టెక్ యూనివర్సిటీ కూడా రాష్ట్రంలో ఏర్పాటు- చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విశాఖలో ఏఐ, స్పోర్ట్స్ యూనివర్సిటీ- రావాల్సి ఉందన్నారు. దేశంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు ఏపీలో ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. ప్రైవేటు- విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ చట్ట సవరణ బిల్లుకు ఏపీ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా రాష్ట్రంలోనే నాణ్యమైన విద్యను అందించేలా సంస్థలను తీసుకురావాలని ఎమ్మెల్యేలు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్.. దేశంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు అయ్యేలా చర్యలు చేపడతామన్నారు.

## హైడ్రా పేరుతో బెదిరించి... కాంగ్రెస్ వసూళ్లు

మొదటి పేజీ తరువాయి...

ఆక్రమిస్తూ, పేదలపై ప్రతాపం, పెద్దలతో ఒప్పందాలు చేసుకుంటున్నాని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న నాడు మద్యం అమ్మకాలపై ఏకరువు పెట్టిన కాంగ్రెస్ పార్టీ నేడు మద్యం ముద్దు అంటోందని ఫైర్ అయ్యారు. ధరల సవరణ, కొత్త బ్రాండ్ల పేరుతో అక్రమ ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. ఎన్నికలు సందర్భంగా ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను గాలికొదిలి, ప్రశ్నించిన వారిని జైలుకు పంపుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాతలకు రైతు భరోసా రావట్లేదని, రుణ మాఫీ చేయట్లేదని అన్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్. ఓ బోగస్ అంటూ ఎద్దేవా చేశారు. తులం బంగారం ఇవ్వరు. ఉద్యోగాలు వేయరని మండిపడ్డారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో దేశానికే దిక్సూచిగా ఎదిగిన తెలంగాణను 15 నెలల కాంగ్రెస్ పాలనలో అధ పాతాళానికి తొక్కేశారని ఆక్షేపించారు. ఆర్థిక శక్తిగా ఎదిగిన రాష్ట్రాన్ని ఆగం చేసి బీద అరుపులు అరుస్తున్నారని అన్నారు. ఇది పాలన కాదు పీడన అని.. ఇది సర్కారు కాదు సర్కస్ కంపెనీ.. జాగో తెలంగాణ జాగో అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.





## సునీత క్షేమంగా తిరిగి రావాలి

మొదటి పేజీ తరువాయి...

చేరుకున్నారు. వారం రోజులకే తిరిగి భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. నాటినుంచి సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌లోనే చిక్కుకుపోయారు. ఎట్టకేలకు వీరిరువురు తిరిగి భూమికి వస్తున్నారు. బుధవారం తెల్లవారు జామున వీళ్లు భూమ్మీదకు రానున్నారు. ఈ సందర్భంగా సునీత విలియమ్స్‌కు ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. సునీత విలియమ్స్ సురక్షితంగా భూమ్మీదకు రావాలని మొత్తం ప్రపంచం ఎదురుచూస్తోందని మోదీ పేర్కొన్నారు. ఆమె ఆరోగ్యం బాగుండాలని దేశ ప్రజలు ప్రార్థిస్తున్నారని అన్నారు. తను అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు ట్రంప్‌ని కలిసినా.. లేదా బైడెన్‌ని కలిసినా.. ఆమె ఆరోగ్యం గురించి విచారించినట్లు పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయులు ఆమె సాధించిన ఘనతకు గర్వపడుతున్నారని తెలిపారు. ఆమె భర్త మైఖేల్ విలియమ్స్‌కి సునీతతో పాటు బుచ్ విల్‌మోర్‌కి కూడా ఆయన బెస్ట్ విషెస్ తెలియజేశారు.




## నేడు అసెంబ్లీలో తెలంగాణ బడ్జెట్

మొదటి పేజీ తరువాయి...

భట్టి విక్రమార్క శాసనసభలో బుధవారం ఉదయం 11.14 గంటలకు ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌ను ముందుగా కేబినెట్ ఆమోదించాల్సి ఉంటుంది. దీంతో ఉదయం 9.30 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం కానుంది. అసెంబ్లీ కమిటీ హాలులో మంత్రివర్గ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపనుంది. అనంతరం బడ్జెట్ కాపీలతో భట్టి విక్రమార్క అసెంబ్లీకి చేరుకోనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది రెండో బడ్జెట్ కావడం విశేషం. బడ్జెట్‌లో ఎలాంటి నిర్ణయాలు ఉండబోతున్నాయని రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఏ పథకానికి ఏ మేరకు కేటాయింపులు ఇవ్వబోతున్నదనేది ఆసక్తిగా మారింది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్రంలోని ప్రాజెక్టుల విషయంలో కీలక ప్రకటనలు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## అసెంబ్లీలో పారిపోయిన కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి...



తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో హరీశ్ రావు చిట్‌చాట్ చేశారు. ఈ ప్రభుత్వం హెచ్ఎండీఏ భూములు తాకట్టు పెట్టి 20 వేల కోట్లు అప్పు తెస్తున్నారు. టీజీఐఐసీ 10 వేల కోట్లు, హెచ్ఎండీఏ ఆస్తులు కుదబెట్టి 20 వేల కోట్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ 10 వేల కోట్లు, జీహెచ్ఎంసీ ఆస్తులను తాకట్టు పెట్టి 10 వేల కోట్లు అప్పులు తెచ్చేందుకు సిద్దమైంది. మొత్తం 50 వేల కోట్లను అప్పు చేస్తుంది. మా ప్రశ్నలపై సమాధానం చెప్పలేక మా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుంది. సభ్యుల హక్కులను స్పీకర్ కాపాడాలి. జీవోలను వెబ్‌సైట్‌లో పెట్టడం లేదు అని హరీశ్‌రావు తెలిపారు. ఆంధ్ర జలదోపిడీ కారణంగా మహబూబ్ నగర్, నల్లగొండలో పంటలు ఎండిపోతున్నాయి. రైతు భరోసా వానకాలం వేశారా లేదా అని ప్రశ్న వేస్తే దానిని రద్దు చేశారు. కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడం వల్ల తక్కువ ధరకు రైతులు పంటలు అమ్ముకొని నష్టపోయారు. మా హయంలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. ప్రస్తుత ప్రభుత్వం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. మేము 54 లక్షల మెట్రిక్ టన్నుల సన్న వరి ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం అన్నారు. కొన్నది 24 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. ధాన్యం కొనుగోళ్లలో ఈ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది అని హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. యాసంగి రైతు భరోసా ఇంతవరకు ఇవ్వలేదు. వరంగల్ జిల్లాలో దేవాదుల కింద పంటలు ఎండిపోతున్నాయి. మల్లన్న సాగర్, దుబ్బాకలో పంటలు ఎండిపోతున్నాయి. వీటి పైన మేము ప్రశ్నలు వేస్తే ఈరోజు ప్రశ్నోత్తరాలు రద్దు చేశారు. రైతు రుణమాఫీ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. రుణమాఫీ పూర్తయిందని ముఖ్యమంత్రి, మంత్రులు పదే పదే చెబుతున్నారు, కానీ ఇంకా 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదు. నిజామాబాద్ జిల్లాలో రుణమాఫీ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. నా నియోజకవర్గంలో రైతు భరోసా క్రింద రైతులకు 39 కోట్లు మాత్రమే వేశారు. ఇంకా 37 కోట్లు రావాల్సింది. కాంగ్రెస్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక హడావిడిగా ప్రశ్నోత్తరాలను ఎత్తివేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానాలు ఇవ్వడానికి భయపడుతుంది. సభ్యులకు తెలియకుండా ప్రశ్నోత్తరాల్లో ప్రశ్నలు మారుతున్నాయని హరీశ్ రావు తెలిపారు. నిన్న రెండు ముఖ్యమైన ప్రశ్నలు ఉండేవి. హెచ్ఎండీఏ భూములు తాకట్టు పెట్టి అప్పు తెచ్చిన విషయం. జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ నుంచి అప్పులు తెచ్చిన విషయం. ఇవి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారుతాయని ఈరోజు ప్రశ్నోత్తరాలను రద్దు చేశారు. ఎంఐఎం వారి ప్రశ్న కూడా ఒకటి ఉండేది. మా మూడవ ప్రశ్న యాసంగి పంటలు ఎండిపోతున్నాయి అనే అంశంపై మా కేటీఆర్ ప్రశ్న ఉండేది. శాసన సభ వ్యవహారల మంత్రిని అడుగుతున్నా, ప్రశ్నోత్తరాలను ఎందుకు రద్దు చేశారు. ప్రభుత్వం మా ప్రశ్నలకు సమాధానం చెప్పలేక హడావిడిగా ప్రశ్నోత్తరాలను రద్దు చేసింది. స్పీకర్‌తో నిన్ననే ఫోన్‌లో మాట్లాడాను. హడావుడిగా చేసి క్వశ్చన్ అవర్ లేకుండా చేశారు. ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఇలా రద్దు చేయడం ఏంటి. క్వశ్చన్ అవర్ మ్యాండేటరీ. జీరో అవర్ పెట్టకపోయినా, కనీసం క్వశ్చన్ అవర్ పెట్టాల్సిందే అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# కుంభమేళా మృతులకు నివాళి ఏదీ!

## ప్రధాని మోడీపై విపక్షనేత రాహుల్ విసుర్లు

న్యూఢిల్లీ మార్చి18 (నిఘా న్యూస్): మహాకుంభమేళ విజయవంతం కావడంపై ప్రధాని మోదీ పార్లమెంటులో స్పందించినా, తొక్కిసలాట ఘటనలో మరణించిన వారికి ఆయన నివాళులర్పించ లేదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. మంగళవారం లోక్ సభలో, వెలుపల ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రయాగ్ రాజ్ వేదికగా నిర్వహించిన మహాకుంభమేళ విజయవంతం కావడంపై ఉత్తరప్రదేశ్ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారని చెప్పారు. కానీ ఈ ప్రయాగ్ రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో పలువురు మరణించారని, వారికి ప్రధాని మోదీ నివాళులర్పించలేదని చెప్పారు. కుంభమేళా అంటే చరిత్ర, సంస్కృతి, సంప్రదాయమని రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఆ క్రమంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలతో తాము పూర్తిగా ఏకభవిస్తామన్నారు. కానీ తొక్కిసలాట ఘటనలో మరణించిన వారికి ఘనంగా నివాళులు అర్పించక పోవడం పట్ల ఆయన తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే ఈ కుంభమేళ కారణంగా తమకు ఉపాధి లభిస్తోందని యువత ఆశించిదని చెప్పారు. కానీ



వారి ఆశలపై నీళ్లు చల్లారన్నారు. అయితే మనది ప్రజాస్వామ్య దేశమని ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుడికి సభలో మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. కానీ తనకు సభలో మాట్లాడే అవకాశం మాత్రం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు దాదాపు 45 రోజుల పాటు ప్రయాగ్ రాజ్‌లో మహాకుంభమేళ నిర్వహించారు. ఈ మహాకుంభమేళలో పవిత్ర స్నానమాచరించేందుకు దేశ విదేశాల నుంచి కోట్లాది మంది ప్రయాగ్ రాజ్ చేరుకున్నారు. అలా దాదాపు 60 కోట్ల మందికి పైగా భక్తులు గంగానదిలో పవిత్ర స్నానమాచరించారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ బడ్జెట్ రెండో విడత సమావేశాలు ఇటీవల ప్రారంభమైనాయి. దీంతో మంగళవారం లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ మహా కుంభమేళ విజయవంతమైందన్నారు. అందుకు యూపీ ప్రజలతోపాటు ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. భారత్ అంటే ఏమిటనేది ఈ మహాకుంభమేళ ద్వారా మరోసారి ప్రపంచానికి నిరూపితమైందన్నారు. జనవరి 29వ తేదీన మౌని అమావాస్య. ఈ నేపథ్యంలో కోట్లాది మంది ప్రజలు పుణ్య స్నానమాచ రించేందుకు ప్రయాగ్ రాజ్ చేరుకున్నారు. ఆ క్రమంలో తొక్కిసలాట జరిగింది. దీంతో పలువురు భక్తులు మరణించగా, మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. అలాగే దేశ రాజధాని న్యూఢిల్లీలో సైతం మహాకుంభమేళలో పాల్గొనేందుకు ప్రయాగ్ రాజ్ రైల్వే స్టేషన్‌కు భారీగా భక్తులు చేరుకున్నారు. ఆ సమయంలో సైతం తొక్కిసలాట జరిగింది. ఆయా ఘటనల్లో మృతులకు ప్రధాని మోదీ నివాళులర్పించ లేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు.

## ఎల్ ఓ సి అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే



**హబ్సిగూడ, మార్చి 18 (నిఘా న్యూస్):** హబ్సిగూడ డివిజన్ పరిధిలోని రామ్ రెడ్డి నగర్ కి చెందిన దొడ్డి వెంకటయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం స్థానిక బిఆర్ఎస్ నాయకులు చెట్టుకూరి దినేష్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుండి రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి ని బాధితుడికి మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారు ముఖ్యమంత్రి సహాయ నిధిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చేతన, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సోమి రెడ్డి, డాక్టర్ బివి చారి, కైలాష్ పతి గౌడ్, చెట్టుకూరి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## బెట్టింగ్ యాప్స్ తో ప్రాణాలకు ముప్పు



**నారాయణపేట, మార్చ్ 18 (నిఘా న్యూస్):** యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్,గేమ్ యాప్‌లకి అలవాటు పడి అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని,జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆవేదన వ్యక్తపరిచారు. మోసపూరిత ప్రకటనలు, నమ్మి సందేశాలు ఇతర వివరాలు పంపవద్దని, ఎవరు కూడా డబ్బులు ఉచితంగా ఇవ్వరని పేర్కొన్నారు. ఆన్లైన్లో డబ్బులు ఎక్కువ ఇస్తామంటే ఎట్టి పరిస్థితుల్లో కూడా నమ్మవద్దని కోరారు. అక్రమ బెట్టింగ్ యాప్స్ లలో బెట్టింగ్ కి పాల్పడిన ,ఆన్‌లైన్ గేమింగ్ యాప్ లలో గేమ్స్ ఆడిన, ప్రోత్సాహించిన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

## బిక్కవోలులో జప్తు చేసిన వాహనాల బహిరంగ వేలం



**బిక్కవోలు, మార్చి 18 (నిఘా న్యూస్):** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బిక్కవోలు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈనెల 20వ తేదీన గతంలో అనేక కారణాలవల్ల జప్తు చేసిన వాహనాలను బహిరంగ వేలంపాట ద్వారా విక్రయించడం జరుగుతుందని స్టేషన్ ఎస్సై వి.రవిచంద్ర కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 మోటార్ వాహనాలు రెండు ఆటోలు ఒక కారు ఈనెల 20వ తేదీన బిక్కవోలు మండల రెవెన్యూ అధికారి సమక్షంలో జప్తు చేసిన వాహనాలను బహిరంగ వేలంపాట నిర్వహించడం జరుగుతుందని, పూర్తి సమాచారం కోసం బిక్కవోలు పోలీస్ స్టేషన్ నందు సంప్రదించవలెనని కోరారు.

## రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం




**బిక్కవోలు, మార్చి 18 (నిఘా న్యూస్):** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలభద్రపురం సబ్ స్టేషన్లో కొత్తగా అదనపు 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయు నిమిత్తం ఈ నెల 20వ తేదీ గురువారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బలభద్రపురం, కాపవరం, గంగులూరు పాకలు గ్రామాలు, వ్యవసాయ మరియు ఇండస్ట్రియల్ సర్వీసులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని కనుక వినియోగదారులు సహకరించవలెనని రాజమహేంద్రవరం రూరల్ ఇగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలియజేశారు.

## పోలీస్ కమిషనర్ ను కలిసిన లీగల్ సర్వీసెస్ టీం



**కరీంనగర్, మార్చి 18 (నిఘా న్యూస్):** సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీసెస్ టీం ఇండియా ఆధ్వర్యం లో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ను మర్యాద పూర్వకంగా కలిసి స్వాగత ప్రశంసా పత్రాన్ని అంద చేసినట్టు తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ సెల్ డైరెక్టర్ షేక్ చాంద్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సయ్యద్ సయ్యద్ సి పి గౌస్ అలంకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం తెలిపారు. రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు సయ్యద్ పాషా, వ్యక్తిగత కార్యదర్శి అబ్దుల్లా నహీద్, యూత్ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ అర్బాజ్ హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు అరుణ్ పాల్గొన్నట్లు వారు తెలిపారు.

# బీసీలకు రిజర్వేషన్ బిల్లు ఆమోదం పట్ల హర్షం

### తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నరసయ్య



**ముషీరాబాద్, మార్చి 18 (నిఘా న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రవేశపెట్టిన బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడం పట్ల తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నరసయ్య, బీసీ జన సమితి అధ్యక్షుడు ఎస్ జస్వంత్ కుమార్ ముషీరాబాద్ జన సమితి కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్ లు హర్షం చేశారు. మంగళవారం హైదరాబాద్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక సంస్థలతోపాటు ఉద్యోగ నియమాకాలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు సభ ఆమోదం పొందడం అభినందనీయమని అన్నారు. ఈ బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లు ఆమోదం ద్వారా బీసీలు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. కింది స్థాయి నుంచి రాజకీయంగా రాణించడం ద్వారా తమ తమ సామాజిక వర్గాలు భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకునే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడానికి చిత్తశుద్ధితో ఉండాలని వారు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ జన సమితి నాయకులు గుండెబోయిన రవీందర్ యాదవ్, అజయ్ గౌడ్, హనుమంత్ గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు ఫర్నిచర్ బహుకరించిన ఫణిశ్రీ



**కాకినాడ, మార్చి 18 (నిఘా న్యూస్):** కాకినాడ జిల్లా అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం గొల్లల మామిడాడ ద్వారపూడి కాశీరత్నం జిల్లా ప్రజా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్ గా పనిచస్తున్న ఖండవిల్లి ఫణిశ్రీ తన తండ్రి వాడపల్లి శేషావతారం జ్ఞాపకార్థం సుమారు 25 వేల రూపాయల విలువచేసే ఎస్ టైపు కుర్చీలను ఉపాధ్యాయుల సౌకర్యార్థం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తి వెంకట్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఫణిశ్రీ తండ్రిగారైన శేషావతారం పెదపూడి గ్రామానికి చెందిన గాంధీ మెమోరియల్ గవర్నమెంట్ హై స్కూల్లో పనిచేసి స్వర్గస్తులైన విషయం విదితమే. వారి జ్ఞాపకార్థం ఆయన కుమార్తె సంపర గ్రామానికి చెందిన ఖండవిల్లి ఫణిశ్రీ హనుమంతరావు దంపతులు ఈ ఫర్నిచర్ ను బహుకరించారు. అంతేకాకుండా వీరు గతంలో కాజులూరు ఉన్నత పాఠశాల, రామచంద్ర పురం ఉన్నత పాఠశాలలో తండ్రి జ్ఞాపకార్థం అనేక విరాళాలు ఇచ్చారని పుణ్య లోకాలకేగిన తన తండ్రి ఆత్మశాంతికి తండ్రికి తగ్గ తనయగా అయనపై గల అపార ప్రేమాభిమానాలతో ఈమె చేస్తున్న సేవా కార్యక్రమాలను భర్త ఖండవిల్లి హనుమంతరావు ప్రోత్సహించడం గొప్ప విషయమని పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేసారు. కంటే కూతురునే కను అను నానుడిని నిజం చేస్తూ అమరులైన తన తండ్రిని ప్రజల హృదయాలలో నిలిచేలా చేస్తున్న ఫణిశ్రీని పాఠశాల ఎస్ఎంసి ఎక్సఆఫీషియో సభ్యులు రెడ్డి బాబు మోటార్స్ అధినేత ద్వారంపూడి సుబ్బారెడ్డి, కొవ్వూరి రామిరెడ్డి (మురళి)పాఠశాల దాత సత్తి త్రినాధ రెడ్డి ఎస్ఎంసి ఛైర్పర్సన్ వల్లు రోషిణి,ఎస్ఎంసి సభ్యులు, కూటమి నాయకులు తమలపూడి శివరామారెడ్డి,జుత్తుక కృష్ణ సూర్యకుమారి దంపతులు, జుత్తుక సూరిబాబు, రావాడ నాగు, ద్వారంపూడి కాశీ విశ్వనాధరెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి, ద్వారంపూడి జగదీశ్వరరెడ్డిని పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

# ఆలయ నిర్మాణానికి ఐదు లక్షల విరాళం


### కంటే వీర్రాజు ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవలు బూరుగుపూడి లో కంటే వినయ్ తేజ



**కోరుకొండ, మార్చి 18 (నిఘా న్యూస్):** కోరుకొండ మండలం బూరుపూడి గ్రామంలో నిర్మించ తలపెట్టిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు వ్యవసాయ సలహా మండలి తూర్పుగోదావరి జిల్లా మాజీ సభ్యులు కంటే వినయ్ తేజ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూరుపూడి గ్రామంలో యువత ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన ఆలయ నిర్మాణములో తనవంతుగా ఐదు లక్షల రూపాయలు విరాళం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. తన తాతగారైన కంటే వీర్రాజు ట్రస్ట్ ఏర్పాటు చేయడం ద్వారా మరిన్ని సేవలు అందించాలని భావిస్తున్నట్లు తెలిపారు. కులమత వర్గ విభేదాలు లేకుండా తన తాత కంటే వీర్రాజు బూరుపూడి గ్రామంలో పాటు పరిసర గ్రామాలకు ఎన్నో సేవలు అందించారని సనాతన ధర్మం కోసం ఎంతో కృషి చేశారని వివరించారు. అదే స్ఫూర్తితో తన సతీమణి సువర్ణ సుప్రియ ఆధ్వర్యంలో కంటే వీర్రాజు ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని కనీసం 20 రోజుల్లో ఈ ట్రస్టు ద్వారా ఐదు లక్షల రూపాయలు తొలి విరాళం అందజేస్తామని వెల్లడించారు. అన్ని శుభాలు చేకూర్చే సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుడు ఆరోగ్య కారకుడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణములు భాగస్వామ్యం ద్వారా మరిన్ని సేవలకు శ్రీకారం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పెన్నాడ త్రిమూర్తులు, చింతల బన్ను మాగాపు వీరన్న, శంకర్, సుబ్బారావు, పూర్ణ, వెంకన్న, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# నేల ఆరోగ్యంగా మానవాళి ఆరోగ్యంగా ఉంటుంది

### జిల్లా వ్యవసాయ అధికారి జేడిఏ మాధవరావు



**కోరుకొండ, మార్చి 18 (నిఘా న్యూస్):** తూర్పుగోదావరి జిల్లా లో కోరుకొండ డివిజన్ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025 వర్క్ షాప్ మీటింగ్ మంగళవారం కోరుకొండ, సీతానగరం మండలాలకు సంబంధించి రైతు సాధికార సంస్థ, కమ్యూనిటీ మేనేజడ్ నాచురల్ ఫార్మింగ్ వ్యవసాయ డిపార్ట్మెంట్, డిఆర్డిఏ సెర్ప్, జెడిఎ మాధవరావు డీపీఎం తాతారావు ఏ డి పి ఎం వలి ఏడిఏ మల్లికార్జున రావు ఏపిఎం సూరమ్మ ఆత్మ బీటీఎం రాజశేఖర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖరీఫ్ ఏక్షన్ ప్లాన్ నిర్వచనం ముఖ్య ఉద్దేశ్యం కే పి ఎ దశలు అనే అంశాలను ఏపీ సీఎం ఎఫ్ డిపిఎం తాతారావు వివరించారు. తర్వాత ఏపీ సీఎం ఎఫ్ లో డి ఆర్ డి ఏ సెర్ప్ వారి పాత్ర ఏపీ ఎమ్మెస్ సీసీలు వివో ఏ- ఓబి ముఖ్య పాత్ర, సప్త సూత్రాలు గురించి ఏడిపిఎం వలి వివరంగా తెలియచేయడం జరిగింది. తర్వాత రెండు మండలాలకు సంబంధించిన కోరుకొండ,సీతానగరం మండల లా వ్యవసాయ అధికారులు సూర్య రమేష్, గౌరీ ఈ కార్యక్రమని ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ప్రకృతి వ్యవసాయం గురించి పి ఎం డి ఎస్ వివరించి అందరూ కలిసి ప్రకృతి వ్యవసాయంను ముందుకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి జెడిఎ మాధవరావు మాట్లాడుతూ పంటలలో వచ్చే తెగుళ్ల గురించి వాటికి ఉపయోగించే మందులు గురించి తెలిపారు. పంటలకు ప్రకృతి వ్యవసాయ కాషాయాలు ఉపయోగిస్తే భూమి గాలి నీరును బాగుచేసుకోవచ్చు అలాగే పి ఎం డి ఎస్ అనేది ముఖ్యమైనది అని వివరించారు. నేల ఆరోగ్యంగా ఉంటే మనమందరం ఆరోగ్యంగా ఉంటామని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంట నాణ్యంగా ఉంటుందని వాటికి సర్టిఫికేషన్ కూడ జరుగుతుందని చెప్పడం జరిగింది.పండించిన పంటకు విలువ జోడించడం అనేది చాలా ముఖ్యం అని పేర్కొన్నారు. అలాగే ఏపీఎం సూరమ్మ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. మండల స్థాయిలో గ్రామ సంఘ స్థాయిలో చిన్న సన్నకారు మహిళ రైతులు భూమి ఉన్న ప్రతి ఒక్కరు వ్యవసాయం చేయాలి. అలాగే ఎన్ఆర్ఈజీసి చేసే సర్వే లో కిచెన్ గార్డెన్ కి సంబంధించి ఇంట్లోనే సేంద్రియ ఎరువు తయారు చేసుకుని వేసుకోవాలని వివరించారు. మండలంలోని ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు పంటలనుపరిశీలించారు. వాటినే ప్రతి వారం తీసుకోవడం జరుగుతుందని చెప్పడం జరిగింది ఏపీ సీఎం ఎఫ్ సిబ్బంది అందరూ చాలా కష్ట పడి గ్రామాలలో వర్క్ చేస్తున్నారని తెలియజేయడం జరిగింది. వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయం ముందుకు వెళ్లే ప్రక్రియలో ముఖ్యపాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం చేసిన రెండు మండలాల సంబంధించిన ఆదర్శ రైతులు అప్పల రాజు, ధర్మరాజు, అరవల రాజు మహిళా రైతు అరుణ అనుభవాల తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ నుండి ఐ సి టి డి పి ఎం యు రామకృష్ణ, కృపావతి, తేజస్వి ,మానస, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డిఆర్డిఏ సెర్ప్ సిబ్బంది, రైతులు హాజరైనారు.

# స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కు ఎంపికైన బాలుకు సన్మానం



**పీలేరు, మార్చి 18 (నిఘా న్యూస్):** స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (సి.జి.ఎల్ -24) పరీక్షలో అఖిల భారత స్థాయిలో మంచి ర్యాంక్ సాధించి, జనరల్ కేటగిరీలో సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్‌లో జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైన అన్నమయ్య జిల్లా, పీలేరు పట్టణానికి చెందిన జొన్నగడ్డల బాలు వికాస్‌కు వి.ఎస్.ఎన్ సిద్ధార్థ పాఠశాలలో ఘన సన్మానం జరిగింది. బాలు వికాస్ 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఈ పాఠశాలలోనే విద్యనభ్యసించారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీలేరు మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. బాలు వికాస్‌ను అభినందిస్తూ, వి.ఎస్.ఎన్ సిద్ధార్థ పాఠశాల ఇతర ప్రైవేట్ పాఠశాలలకు భిన్నంగా విశిష్టమైన విద్యను అందిస్తోందని కొనియాడారు. బాలు వికాస్ విజయంలో అతని కఠోర శ్రమతో పాటు ఉపాధ్యాయుల బోధన, తల్లిదండ్రుల సహకారం కూడా కీలక పాత్ర పోషించాయని అన్నారు. ఇలాంటి విజయాలు సాధించిన విద్యార్థుల ప్రయాణాన్ని ప్రస్తుత విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. వి.ఎస్.ఎన్ విద్యాసంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన వేలాదిమంది విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా సంఘం అధ్యక్షులు, కవి, బాలు వికాస్ మేనమామ జలకనూరి మురళీధర్ రాజు, పాఠశాల బోధన సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకాళహస్తీశ్వర దేవస్థాన ఆలయంలో సంఘట హర చతుర్థి సందర్భంగా కన్య మూల గణపతి వినాయకుడి వద్ద హెూమం నిర్వహించారు. ముందుగా కలస్థాపన గణపతి పూజ పుణ్యా వచనము కలశానికి పుష్పాలతో పూజలు చేసి హెూమగుండంలో హెూమం వేసి పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

*-శ్రీకాళహస్తి, మార్చి 18 (నిఘా న్యూస్):*

## రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి



**హబ్సిగూడ, మార్చి 18 (నిఘా న్యూస్):** హబ్సిగూడ డివిజన్ లోని వీధి నెంబర్ 1 లో సుమారు 28 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ కక్కినేని చేతన తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళుతున్నట్లు చెప్పారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ ను అభివృద్ధి చేయడానికి అన్ని విధాల కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రోడ్లు వేయిస్తున్నా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, బిజెపి నాయకులు సంజయ్ పటేల్,న్యాలకొండ సుమన్ రావు, బొమ్మగోని రఘుపతి గౌడ్ ,చెల్లోజు ఎల్లాచారి,చింతకింది ప్రవీణ్,రంగరవి,గ్యార రవీందర్, అల్కాపురి సురేష్ కట్ట భాస్కర్,రమేష్ నాయక్, శ్రీనివాస్ ,సుకన్య, కొండేరు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో ఆయుర్వేద కౌన్సిల్ బిల్లుకు ఆమోదం

### హర్షం వ్యక్తపరిచిన మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ నారాయణ



**శ్రీ కాళహస్తి, మార్చి 18 (నిఘా న్యూస్):** రాష్ట్ర అసెంబ్లీలో ఆయుర్వేద కౌన్సిల్ ఏర్పాటుకు బిల్లు ప్రవేశపెట్టారు. ఇది ఆయుర్వేద వైద్యుల చిరకాల స్వప్నంగా శ్రీకాళహస్తి ఆయుర్వేద డాక్టర్, మెడికల్ ప్రాక్టీషనర్స్ ఆర్గనైజర్ సెక్రెటరీ డాక్టర్ నారాయణ ఆ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర అసెంబ్లీ లో ఈ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన శాసనసభ్యులకు ది మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ కార్య దర్శి బిజెపి ఇంటలెక్చువల్ సెల్ కన్వీనర్ డాక్టర్ నారాయణ ధన్యవాదములు తెలిపారు. త్వరలోనే ఈ బిల్లు గవర్నర్ ఆమోదం, గెజిట్ నోటిఫికేషన్ పొంది, నిబంధనల రూపొందింపు జరిగేలా ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. ఈ బిల్లు ద్వారా అనేక సంవత్సరాలనుండి పాలకమండలి లేకుండా నడుస్తున్న ఆంధ్ర బోర్డు ఫర్ ఆయుర్వేదకు చట్టభద్ధత లభించడం ఆయుర్వేద రంగానికి ఎంతో మేలైన పరిణామం. ఈ బిల్లు వచ్చేలా కృషి చేసినటువంటి ది మెడికల్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ చైర్మన్ డా. వేముల భాను ప్రకాష్, ప్రెసిడెంట్ డాక్టర్ బి రాజేష్ కుమార్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. సిహెచ్ రవికుమార్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## న్యూస్ హేమ నగర్ పార్కు అభివృద్ధికి 20 లక్షలు

### పార్కులో బోరును ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ బొమ్మకు సుగుణ



**బోడుప్పల్, మార్చి 18 (నిఘా న్యూస్):** న్యూ హేమ నగర్ కాలనీ కాలనీలోని పార్కు అభివృద్ధికి 20 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. మంగళవారం అభివృద్ధిలో భాగంగా పార్కులో బోరును మాజీ కార్పొరేటర్ బొమ్మకు సుగుణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పార్కును సుందర వనంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్నట్లు వెల్లడించారు. అనంతరం న్యూ హేమ నగర్ కాలనీ అధ్యక్షులు కటకం రాజేష్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం అధికారులను కలుస్తూ అవసరమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేస్తున్న సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమా, మోహన్ రావు, మల్లేష్, హమీద్ బాయి, సత్యాశీల రెడ్డి కేశవ్ రెడ్డి, గిరి, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

### స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కు ఎమ్మెల్యే వినతిపత్రం



**ఉప్పల్, మార్చి 18 (నిఘా న్యూస్):** ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ఎడ్యుకేషన్ ఆఫ్ స్కూల్ డైరెక్టర్ ఈ.వి.నరసింహారెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రామంతపూర్ ప్రగతి నగర్ లో గల ఎంపీపీఎస్ ఇందిరా నగర్ లో అదనపు తరగతి గదులు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల గల ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని నర్సింహా రెడ్డి ఎమ్మెల్యేకు తెలియజేశారు.

## రంపచోడవరం నుండి.. జగ్గంపేట మీదుగా విశాఖపట్నం బస్సు నడపాలి



**గోకవరం, మార్చి 18 (నిఘా న్యూస్):** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, గోకవరం మండల ప్రజల సౌలభ్యం కోసం రంపచోడవరం నుంచి గోకవరం,జగ్గంపేట మీదుగా విశాఖపట్నం వరకు బస్ సర్వీస్ నడపాలని ఈ ప్రాంత ప్రజలు కోరారు. విశాఖపట్నం వెళ్లేందుకు రాజమండ్రి మీదుగా ప్రయాణించవలసి వస్తుందని దీంతో అదనపు సమయం, అదనపు ఛార్జీల భారం వెచ్చించాల్సి వస్తుందని వారు చెబుతున్నారు. ఈ ప్రాంతం నుండి నిత్యం విశాఖపట్టణానికి విద్యార్థులు ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు. అదేవిధంగా వైద్యం కోసం ఆస్పత్రులకు ముఖ్యంగా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని రంపచోడవరం నుండి గోకవరం జగ్గంపేట మీదుగా విశాఖపట్నం వరకు బస్ సర్వీస్ ను నడపాలని డిపో మేనేజర్ ను ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## ఆరవ రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు



**రామడుగు, మార్చి 18 (నిఘా న్యూస్):** ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంతవరకు గ్రూప్ 1 గ్రూప్ 2 గ్రూప్ 3 లతో పాటు అన్ని రకాల ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో రామడుగు మండల కేంద్రంలో ఇన్చార్జి కొత్తూరు రాజయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన దీక్షలు మంగళవారంతో ఆరు రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు అన్ని రకాల ఫలితాలను నిలిపి వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి శనిగారపు హనుమయ్య, శ్రీరాములపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు దుబ్బాసి అంజయ్య, పందికొండపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కొత్తూరు ప్రశాంత్, సీనియర్ నాయకులు గుడిసె విజయ్, నాగం లక్ష్మీరాజ్యం, బూత్కూరి అంజయ్య, జంగిలి వేణు, చంటి నరసయ్య, బూత్కూరి మల్లయ్య, తిమ్మల గంగయ్య, మాడిశెట్టి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ మాజీ మేయర్ కు ఘన సన్మానం



**కరీంనగర్, మార్చి 18 (నిఘా న్యూస్):** గత ఐదు సంవత్సరాల కాలంలో కరీంనగర్ సిటీని అభివృద్ధి చేసినందుకు మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావును పద్మనాయక వెలమ సంఘం సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పద్మనాయక ఏసీ హాల్ పునర్నిర్మాణానికి తమ వంతు సహకరించాలని అలాగే కరీంనగర్ పార్లమెంటు సభ్యులు కేంద్ర సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ నిధుల నుండి సంఘ అభివృద్ధికి సహకారం చేయాలని ఈ సందర్భంగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పద్మనాయక వెలమ సంఘం జాయింట్ సెక్రటరీ బోయినపల్లి భూపతి రావు, కార్యవర్గ సభ్యులు వాల శంకర్ రావు, సుంకిశాల సంపత్ రావు, జూపల్లి మాధవరావు, జోగినపల్లి రాజగోపాల్ రావు, పల్లెపాటి వేణుగోపాలరావు, ఆయిల్నేని సుధాకర్ రావు, తాండ్ర అశోక్ రావు, గండ్ర మంజుల తదితరులు పాల్గొన్నారు.

## రామంతపూర్ లో ఇఫ్తార్ విందు



**రామంతపూర్, మార్చి 18 (నిఘా న్యూస్):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రామంతాపూర్ వలి కుతుబ్షాహీ మెట్రో మజ్జిద్ లో రామంతాపూర్ డివిజన్ అధ్యక్షులు రఫీక్ ఏర్పాటుచేసిన ఈఫ్తార్ విందులో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తౌఫిక్, తావీదబోయిన గిరిబాబు ఆకారపు అరుణ్, కంది శ్రవణ్ రెడ్డి, గరిక సుధాకర్ లూకాస్,పూస సత్తి అన్న, వల్లపు శ్రీకాంత్ యాదవ్ జలీల్ పాష, ఉదయ్ భాస్కర్ గంగపుత్ర సతీష్ గౌడ్, జంగయ్య, జిమ్ సందీప్, అలీం అస్లాం, భాస్కర్ అఫ్గల్, వాహెద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రకటించిన హామీలను అమలు పరచండి

### అంబర్ పేట తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించిన ఆశా వర్కర్లు



**అంబర్ పేట, మార్చ్ 18 (నిఘా న్యూస్):** శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేలు ఫిక్సుడ్ వేతనం నిర్ణయించి, ప్రమోషన్, పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు నగర ఉపాధ్యక్షుడు జి.రాములు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు మంగళవారం అంబర్ పేట ఎమ్మార్వో వీరాబాయిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజుల పాటు ఆశా వర్కర్లు రాష్ట్రంలో నిరవధిక సమ్మె చేశారని తెలిపారు. సమ్మె సందర్భంగా కోఠి కమీషనర్ ఆఫీస్ ముందు వేలాది మంది ఆశా వర్కర్లతో ధర్నా చేసినట్లు తెలిపారు. ఈ ధర్నా సందర్భంగా అప్పటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశా యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపి కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. డైరెక్టర్ హామీ మేరకు అక్టోబర్ 9న అశా వర్కర్లు నిరవధిక సమ్మెను విరమించారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా పర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీనిచ్చిందని రాములు పేర్కొన్నారు. ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడంతో ఆశ వర్కర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం 18 వేలు ఇవ్వాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆశాలతో కలిసి ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ అంబర్ పేట జోన్ నాయకులు ఏ.సరస్వతి, దేవయాని, శోభ, విజయలక్ష్మి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

## గోకవరంలో జ్యోతుల రామస్వామి విస్తృత పర్యటన

### మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీ శ్రేణుల సంబరాలు



**గోకవరం, మార్చి 18 (నిఘా న్యూస్):** జగ్గంపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జ్యోతుల చంటి బాబు తండ్రి జ్యోతుల రామస్వామి గోకవరం మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని గంగంపాలెం, ఠాగూర్ పాలెం, తిరుమలాయపాలెం, రంప ఎర్రంపాలెం, పెంటపల్లి, బావాజీ పేట, వెదురుపాక, గుమ్మల దొడ్డి, అచ్యుతాపురం గ్రామాలలో పర్యటించిన జ్యోతుల రామస్వామికి వైసిపి పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జ్యోతుల రామస్వామి మాట్లాడుతూ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా నియోజకవర్గ మంతటా కూడా పర్యటిస్తానని పార్టీ బలోపేతం కోసం, కార్యకర్తలలో ధైర్యం నింపి రానున్న రోజుల్లో ఉద్యమ స్ఫూర్తితో ముందుకు కదిలేలా కార్యాచరణతో పనిచేయడానికి పార్టీ శ్రేణులలో ఉత్తేజం నింపడానికే ఈ పర్యటనని మాట్లాడారు. పార్టీ దురదృష్టవశాత్తు పరాజయం పాలైనా పార్టీ శ్రేణుల్లో ఏమాత్రం హుషారు తగ్గలేదని మిమ్మల్ని చూస్తుంటే ఇంకా రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని అనిపిస్తుందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోనికి తీసుకొచ్చి జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి గా చేసుకునే వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరం కంకణబద్ధులమై పనిచేద్దాం అని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు యోగక్షేమాలు తెలుసుకున్న జ్యోతుల రామస్వామి మీకు ఏ కష్టం వచ్చినా జ్యోతుల చంటిబాబు,నేను నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. రానున్న కొద్ది రోజుల్లో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తలతో భారీ సమావేశం ఏర్పాటు చేసే ఉద్దేశ్యం ఉందని తెలిపారు. కార్యక్రమాల్లో భారీ స్థాయిలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది.

## తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ



**రాజన్న సిరిసిల్ల, మార్చి 18 (నిఘా న్యూస్):** తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించి ఎస్పీ స్టేషన్ పరిసరాలు స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో స్వాదీనం చేసుకున్న వాహనాల వివరాలు, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న,నమోదైన కేసుల వివారాలు, స్టేషన్ రికార్డ్ లు పరిశీలించి, పెండింగ్ కేసులపై అరా తీసి త్వరగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నమోదు అయిన కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని,ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందిస్తూ ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేసారు. పోలీసు స్టేషన్ లో అన్ని రకాల విధులను సక్రమంగా నేర్చుకోవాలన్నారు. రికార్డ్ నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షను, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, సమన్లు మొదలుగు విధులను సీనియర్ల ద్వారా తెలుసు కోవాలన్నారు. పోలీస్ స్టేషన్లో హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడి వారికి కేటాయించ బడిన విధులు అడిగి తెలుసుకొని,బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్ కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను తనిఖీ చేయాలని, స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటుపై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా అధికారులు,విలేజ్ పోలీస్ అధికారులు తరచు గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతు ప్రజలకు చట్టాల మీద, డయల్100,షీ టీమ్స్, సైబర్ నేరాలు,ట్రాఫిక్ నియమాలు తదితర అంశాల మీద అవగాహన కల్పించాలని అన్నారు. ఎస్పీ వెంట సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ మొగిలి, ఎస్ఐ రామ్మోహన్ సిబ్బంది ఉన్నారు.

## మూగ జీవాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత

### చిలుకా నగర్ కార్పొరేటర్ గీత



**చిలుకానగర్, మార్చి 18 (నిఘా న్యూస్):** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత మంగళవారం ఎల్బీనగర్ జోన్ వెటర్నరీ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు ను కార్పొరేటర్ కార్యాలయంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ గీత వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు వారి సిబ్బందితో కలిసి ప్రతి సంవత్సరం జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో మూగ జంతువులకు ముఖ్యంగా వీధి కుక్కలకు ఎండా కాలంలో నీళ్లు లేక ఇబ్బంది పడతాయన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన నీళ్ల తొట్టిల ఏర్పాటు కార్యక్రమాన్ని వివిధ కాలనీల బస్తీల ముఖ్య కూడళ్లలో అసోసియేషన్ కార్యవర్గానికి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మూగ జీవాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చిల్కానగర్ డివిజన్లోని బాలాజీ ఎంక్లేవ్, కళ్యాణ్ పూరి కాలనీ, నార్త్ కళ్యాణపురి, బీరప్ప గడ్డ ప్రాంతంలోని బీరప్ప గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్, బీరప్ప గడ్డలోని సౌత్ ప్రశాంత్ నగర్, ధర్మపురి కాలనీ సాయిరాం నగర్ కాలనీ ,శ్రీనగర్ కాలనీలలో నీళ్లతోట్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, శ్యామ్, కాలనీల అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి,మోతీలాల్, మధుకర్ రెడ్డి, సబర్ భాష, శేఖర్ రెడ్డి, వికాస్, అమరేందర్ రెడ్డి, శివారెడ్డి, కొండయ్య, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో బిజెపి విస్తృత స్థాయి సమావేశం

### హాజరైన జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు



**జగ్గంపేట, మార్చి 18 (నిఘా న్యూస్):** జగ్గంపేట నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ విస్తృత స్థాయి సమావేశం జగ్గంపేట టౌన్ హాల్ ఆవరణలో జరిగింది. జగ్గంపేట నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ దాట్ల కృష్ణ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అధితిగా బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజవర్గం నాలుగు మండలాల్లో బూత్ కమిటీలు నూటికి నూరు శాతం పూర్తి చేయాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపిని మరింత బలోపేతం చేసి అభ్యర్థులు విజయం సాధించేందుకు కృషి చేయాలని గ్రామ, మండల కమిటీలు వేసి పూర్తి చేసుకోవాలని వారు అన్నారు. పార్టీ ప్రతిష్ట కోసం ప్రతి ఒక్కరు శక్తివంచన లేకుండా పనిచేయాలని బిజెపి క్యాడర్ కు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టి బలిజి కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు గండి కొండలరావు (నాని), డివిఎన్ రాజు కాకినాడ జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ, చోడిశెట్టి రమేష్ బాబు, జగ్గంపేట అసెంబ్లీ కో కన్వీనర్ కోన వెంకట సురేష్, జగ్గంపేట మండల అధ్యక్షుడు పల్లా రాము, గండేపల్లి మండల అధ్యక్షుడు తోరాటి వెంకన్న, గోకవరం మండల అధ్యక్షుడు ఇనకోటి బాపన దొర తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం

### ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ ప్రభుదాస్



**మౌలాలి, మార్చి 18 (నిఘా న్యూస్):** మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలనగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకు రావడంతో పాటు, భవిష్యత్తుకు బంగారు బాట వేసుకుంటారని ఆశిస్తూ పరీక్షలు బాగా రాయాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు జానకి కుమారి, శాంత భాయ్, అరుణ దేవి, మాధవి, దేవి, సరిత, కృష్ణమూర్తి, పద్మ, కవిత, అనిత తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ కాలనీలో విద్యుత్ ట్రాన్స్ ఫారం ప్రారంభం



**మౌలాలి, మార్చి 18 (నిఘా న్యూస్):** మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ ను మంగళవారం కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ ప్రారంభించారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ రానున్న వేసవి కాల దృష్ట్యా డివిజన్ లోని అన్ని కాలనీల్లో ఉన్న వివిధ సమస్యలపై దృష్టి సారించి కాలనీవాసుల సౌకర్యార్థం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు వెళతామన్నారు. సహకరించిన విద్యుత్ అధికారులకు అన్నపూర్ణ కాలనీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఏ.ఈ.నాగరాజు మాట్లాడుతూ కాలనీలో నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ నాగరాజు, కాలనీ అధ్యక్షులు నరసింహ గౌడ్, జీఎస్ సంజయ్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.ఎ.ప్రసాద్, యూసుఫ్ బాయ్, రాజమల్లు రాజలింగం, శంకర్ గౌడ్, ప్రేమసాగర్, సదానంద్, రిజ్వాన్ కుమార్ కమిటీ సభ్యులందరూ కాలనీవాసులు అందరూ పాల్గొని కొత్తగా ట్రాన్స్ ఫారం మంజూరైనందుకు హర్షం వ్యక్తం చేశారు.

## సంకటహర చతుర్థి సందర్భంగా గణపతి హోమం



**నల్లకుంట, మార్చ్ 18 (నిఘా న్యూస్):** సంకటహర చతుర్థి సందర్భంగా గోల్నాక హనుమాన్ నగర్ లో ని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో గణపతి హోమాన్ని నిర్వహించారు. దేవాలయ పురోహితుడు ఈశ్వర కృప భాస్కరా శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హోమంలో సీనియర్ పాత్రికేయుడు సతీష్ ముదిరాజ్ -సుగుణ, దశరథ్- లలిత, దాస్- నాగమణి దంపతులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు దేవాలయ కమిటీ తరపున అన్న ప్రసాదం వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు శేఖర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## తాడిపత్రిలో మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం



**తాడిపత్రి, మార్చి 18 (నిఘా న్యూస్):** తాడిపత్రి పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్లో ఉన్న గాంధీ విగ్రహం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి నాయి బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ అధ్యక్షుడు కేఎం. రామకృష్ణ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు కలిసి మంగళవారం నాడు పాలాభిషేకం చేశారు. పీఎం విశ్వకర్మ ఆదరణ పథకం ద్వారా 18 కొలువృత్తుల వారికి శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించి మంచి ఆలోచనతో ముందుకు అడుగు వేసిన నరేంద్ర మోడీకి నాయి బ్రాహ్మణుల సంఘం తరపున కేఎం. రామకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ అధ్యక్షుడు కేయం. రామకృష్ణ, బిజెపి నాయకుడు అంకాల్ రెడ్డి, పి.ప్రతాప్ రెడ్డి, బిజెపి టౌన్ ప్రెసిడెంట్ కృష్ణమోహన్, ఆంజనేయులు, రామాంజనేయులు, నారాయణస్వామి, భీమ లింగేశ్వర్ రెడ్డి, రంగనాయకులు, ఓబిరెడ్డి నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానను తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి




**రామంతాపూర్, మార్చి 18 (నిఘా న్యూస్):** రామంతపూర్ లోని శారద నగర్ బస్తీ బస్తీ దవాఖాన ను ఎల్బీనగర్ జోన్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. బస్తీ దవఖానా లో అందిస్తున్న సేవల గురించి వైద్యాధికారి డాక్టర్ వైశాలిని అడిగి తెలుసుకున్నారు. అందిస్తున్న సేవలను అభినందించారు. రోగులకు సకాలంలో అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని అన్ని మందులు అందుబాటులో ఉంచుకొని నాణ్యమైన వైద్యం ప్రజలకు అందించాలని సూచించారు. అందుబాటులో ఉన్న అన్ని రకాల రక్త పరీక్షలు తెలంగాణ డైగ్నోస్టిక్స్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అవసరమైన పరీక్షలు చేయాలని ఆదేశించారు.

## ఉపాధి హామీ పనులు పర్యవేక్షించిన ఎంపీడీవో

### ఉదయం ఏడు గంటలకు హాజరై 10 గంటలకు పనులు ముగించాలి



**నిజాంపేట, మార్చ్ 18 (నిఘా న్యూస్):** సంగారెడ్డి జిల్లా మునుగేపల్లి పరిధిలో ఫీడర్ ఛానల్ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు తనిఖీ చేసి కూలీల మాస్టర్ హాజరు వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే కూలీలతో మాట్లాడుతూ ఎండలు ఎక్కువ ఉన్నందున ఉదయం ఏడు గంటలకు వచ్చి 10 గంటల వరకు పని ముగించుకుని వెళ్లాలని తెలియజేశారు. అలాగే రామచందర్ తాండ నర్సరీ మొక్కలు పెంపకం పనులు పర్యవేక్షించి నుతానంగా నిర్మించిన జిపి భవనం పనులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ అంజి కురుమ సంఘం అధ్యక్షులు గడ్డమీది పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దేశాలకు భగవద్గీత మార్గదర్శనం

### డాక్టర్ మల్లు వేంకటరెడ్డి



**కర్నూలు, మార్చి 18 (నిఘా న్యూస్):** ప్రపంచ సాహిత్యంలో సాటిలేని గ్రంథం భగవద్గీత అని, శోకమయమైన జీవునికి శాశ్వతమైన ఉపశమనం కలిగిస్తుందని, కులమతాలకతీతంగా భగవద్గీతను అధ్యయనం చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గూడూరు మండలం, మల్లాపురం గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం నందు ప్రారంభమైన ధార్మిక కార్యక్రమాలను వారు ప్రారంభించారు. తదనంతరం ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్ చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. తదనంతరం స్థానిక భజన మండలిచే భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యం.భాగ్యమ్మ, యం.రాఘవేంద్రా రెడ్డి, బి.సోమేశ్వర రెడ్డి, అర్చకులు నంబి చెన్నకేశవులు, తిమ్మప్ప, భాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## రాజగోపురం నిర్మాణానికి భారీ విరాళాలు



**పెదపూడి, మార్చి 18 (నిఘా న్యూస్):** కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడ సూర్యనారాయణపురం లో గల శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి రాజగోపురం నిర్మాణం నిమిత్తం రాజానగరంకు చెందిన సత్తి శ్రీనివాసరెడ్డి మోహిని వరలక్ష్మి దంపతులు వీరి కుమారులు భాస్కర్ సత్యనారాయణరెడ్డి, హిమజ, అర్జున్ కృష్ణారెడ్డి, గోపి సురేందర్ రెడ్డిలు రూ. ఐదు లక్షలు, కొప్పవరంకు చెందిన కర్రి వెంకట్ రెడ్డి సురేఖ దంపతులు లక్ష, గొల్లల మామిడాడలకు చెందిన పులగం సత్యనారాయణ రెడ్డి పార్వతి దంపతులు: లక్ష రూపాయలు విరాళంగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నల్లమిల్లి పద్మనాభ సత్యనారాయణ రెడ్డి, నల్లమిల్లి మోహన రామ గంగాధర రెడ్డి లకు అందించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆరవిల్లి రఘు రామాచార్యులు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో రాజగోపురం నిర్మాణ నిమిత్తం భక్తులు విరాళాలు అందించి సహకరించాలని ఆయన కోరారు.

## పైప్ లైన్ పగిలి వృధాగా పోతున్న మంచినీరు

### నెల రోజులుగా ఫిర్యాదు చేస్తున్న పట్టించుకోని జలమండలి



**అంబర్ పేట, మార్చ్ 18 (నిఘా న్యూస్):** జలమండలి, జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా అంబర్ పేట డివిజన్ ప్రేమ్ నగర్ లింగారావు గల్లీలోని మైసమ్మ దేవాలయం ఎదురుగా మంచినీటి పైపులైన్ లీక్ అవుతూ విలువైన మంచినీరు వృధా అవుతుంది. నెల రోజుల క్రితం మైసమ్మ దేవాలయం ఎదురుగా మంచినీటి పైపులైన్ పగిలి పోయి, మంచినీరు వృధాగా మురికి కాలువల పాలవుతుంది. రోజు విడిచి రోజు గంటన్నర పాటు బస్తీలో నీటి సరఫరా జరుగుతున్నంతసేపు నీరు వృధాగా రోడ్లపై ప్రవహిస్తూ, మురికి కాలువల్లో కలుస్తోంది. ఈ విషయమై జలమండలి అంబర్ పేట సెక్షన్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని బస్తీ వాసులు ఆరోపిస్తున్నారు. లీకేజీని అరికట్టడానికి సీసీ రోడ్డును పగలగొట్టాల్సి వస్తుందని, దీనికి జిహెచ్ఎంసి అంబర్ పేట సర్కిల్ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని జలమండలి అధికారులు అంటున్నారని వారు తెలిపారు. దీనిపై జిహెచ్ఎంసి అధికారులను అడిగితే ఇంతవరకు జలమండలి అధికారులు రోడ్డు కటింగ్ కోసం దరఖాస్తు చేసుకోలేదని అంటున్నారని బస్తీ వాసులు తెలిపారు. ఇరు శాఖల అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత నెల రోజులుగా వేసవి ఎండల్లో మంచినీరు వృధాగా మురికి కాలువల పాలవుతుందని బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై స్థానిక శాసనసభ్యుడు కాలేరు వెంకటేష్ దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే పైప్ లైన్ కు మరమ్మతులు చేయాలని జలమండలి అధికారులను ఆదేశించారని వారు తెలిపారు. అయినప్పటికీ జలమండలి అధికారుల్లో చలనం కలగడం లేదని వారు తెలిపారు. మంచినీటి లీకేజీ పై స్థానిక డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన పట్టించుకోవడంలేదని బస్తివాసులు ఆరోపించారు. ఇప్పటికైనా జలమండలి జిహెచ్ఎంసి అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమస్యను వెంటనే పరిష్కరించి మంచినీటి వృధాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉచిత ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన

### చైర్మన్ ఏర్వ కుమారస్వామి



**రాజేంద్రనగర్, మార్చి 18 (నిఘా న్యూస్):** మానవ సేవే మాధవ సేవా వై.ఆర్.జి.కేర్, తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో, రైల్వే స్టేషన్ బుద్వేల్,ఓల్డ్ కర్నూల్ రోడ్, జెఎస్,బెకరీ ఎదురుగా నిర్వహించిన ఉచిత మెగా ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో షుగర్, బీపీ,హెచ్ఐవి,వంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సంపూర్ణ సురక్ష కేంద్రం – ఉస్మానియా జనరల్ హాస్పిటల్ సౌజన్యంతో విజయవంతంగా నిర్వహించబడింది. సంస్థ చైర్మన్ ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ ఆరోగ్యమే అసలైన ఆస్తి అని, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేలా,మానవ సేవే మాధవ సేవా, పథకంలో మరింత ఎక్కువ సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. పేదలు, అవసరమైన వారు ఉచిత వైద్య సేవలను పొందేందుకు సంస్థ ఎల్లప్పుడు ముందుండి సహాయం అందిస్తుందని చెప్పారు. సంపూర్ణ సురక్ష కేంద్రం సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ ఆరోగ్య శిబిరం ద్వారా హెల్త్ చెకప్, అవగాహన, అవసరమైన వారికి వైద్య సహాయం అందించగలిగామని తెలిపారు. ఆరోగ్యపరమైన సమస్యలను ముందుగా గుర్తించి, తగిన సూచనలు అందించడం తమ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టేందుకు తమ సంస్థ ముందుంటుందని, ప్రజలు వీటి ద్వారా లబ్ధిపొందాలని కోరారు.మానవ సేవే మాధవ సేవ సంస్థకు సహకరించిన నందుకు ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాధవ సేవే మాధవ సేవా చైర్మన్ కుమారస్వామి,డైరెటర్లు కొంపల్లి జగదీష్,డాక్టర్ చేతన్,ఐసిటీసి కౌన్సిలర్లు రమణ రెడ్డి,బోదిరెడ్డి,ఎల్ టీ జేమ్స్,సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్, జి.శ్రీకాంత్,డైరెక్టర్లు రమేష్ రెడ్డి, గోంత్యాల శ్రీనివాస్, హేమలత,గాయత్రి, పిహెచ్ఎంటీ చంద్రకళ, ఏం.పి.హెచ్, ఏ.శిరీష ఆశావర్లు పాల్గొన్నారు.

## టీవీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్, మార్చి 18 (నిఘా న్యూస్):** టీబీ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని అనుమానం ఉన్న వారంతా టీబీ పరీక్ష చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మెట్రోసెమ్ సంస్థ ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం మొహతాజ్ ఖానాలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే టీబీని గుర్తించి మందులు వాడితే సులభంగా నయమవుతుందని అన్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రిలోనూ టీబీ పరీక్ష అందుబాటులో ఉందని తెలిపారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి టీబీ తొందరగా వ్యాపిస్తుందని, అందువల్ల సమతుల పోషకాహారం తీసుకోవాలని సూచించారు. టీబీ వ్యాధి పరీక్షలకు ప్రైవేట్ ఆసుపత్రిలో రూ. 15 వేల వరకు ఖర్చు అవుతుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పరీక్ష ఉచితంగా చేయడంతో పాటు మందులు అందిస్తారని తెలిపారు. ప్రభుత్వం తరఫున ప్రతి నెలా టీబీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వేయి రూపాయలను పోషకాహారానికి వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమ అమలు గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ రిజిస్టరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, టీబి ప్రోగ్రామ్ రవీందర్, ఇమ్యునైజేషన్ సాజిద పాల్గొన్నారు.

### 18 సంవత్సరాలు నిండిన..

## ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ సత్య శారద



**వరంగల్, మార్చి 18 (నిఘా న్యూస్):** సి ఇ ఓ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి తో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆధ్వర్యంలోజిల్లా స్థాయి పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు నియోజక వర్గాల వారీగా ఎలక్టోరల్ డ్రాఫ్ట్ మొత్తం ఓటర్లు 771139 కాగా అందులో అడిషన్స్ 3777 డెలిశాన్స్ 2092 ఉన్నాయని ఫైనల్ ఎలెక్టోరల్ ఓటర్లు 77,2 824 ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్ అనేది నిరంతర ప్రక్రియ అని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫామ్ 6ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని ఫామ్ 7 ద్వారా ప్రస్తుతమున్న ఓటరు జాబితాలో ప్రతిపాదిత పేరును చేర్చడం, తొలగించడం కోసం అభ్యంతరాలకు సంబంధించిన వివరాలను పొందుపరిచి నట్లుయితే వారిని పేరును ఓటరు లిస్ట్ నుండి తొలగించడం జరుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి,ఎలక్షన్ డి టి రంజిత్ కాంగ్రెస్ నుండి ఈవి శ్రీనివాసరావు బిజెపి నుండి హరి శంకర్ టిడిపి నుండి కె శ్యామ్ ఏఐఎంఐఎం నుండి సయ్యద్ ఫిరోజోల్లా బీఎస్పీ నుండి జె అనిల్ కుమార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత పాటించి కనీస మద్దతు ధర పొందండి

### మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య

**బెల్లంకొండ, మార్చి 18 (నిఘా న్యూస్):** మండలంలోని ఎమ్మాజిగూడెం మన్నేసుల్తాన్ పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వరి పంటను పరిశీలించిన ఆకు చుట్టు పురుగు కాండం తొలుసు పురుగు ఆశించినట్లు గమనించి నివారణకు గాను కార్టాప్ హైడ్రో క్లోరైడ్ ఎకరాకు 400 గ్రాములు చొప్పున పిచికారీ చేసుకోవాలని వ్యవసాయ అధికారి డి క్రిష్ణయ్య తెలిపినారు.కంది పంట అమ్మ దలసిన రైతులు రైతు సేవా కేంద్రంలో కందులు అమ్మకం కోసం నమోదు చేసుకోవాలని, తేమశాతం పరీక్ష చేయించుకొని నాన్యత ప్రమాణాలు పాటించి కనీస మద్దతు ధర క్వింటల్ కి రూ 7,550 చొప్పున పొందవచ్చని తెలిపారు. వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతుకు, రైతు విశిష్ట సంఖ్య కోసం వారి ఆధార్, 1బి,ఆధార్ లింక్ అయిన మొబైల్ తో రైతు సేవాకేంద్ర సిబ్బందిని సంప్రదించ వలసిందిగా తెలిపినారు. రైతు విశిష్ట సంఖ్య భవిష్యత్ లో రైతు సంక్షేమ పథకాలు పొందుటకు ముఖ్యం కానున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారి, ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు సాయికిరణ్, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మేనిఫెస్టోలో పెట్టిన 18వేల జీతం అమలు చేయాలి

### కలెక్టరేట్ ముందు అంగన్వాడీల వంటా వార్పుతో నిరసన



**శామీర్ పేట, మార్చి 18 (నిఘా న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన 18వేల జీతం వెంటనే అమలు చేయాలని కలెక్టరేట్ ముందు ధర్నాకు దిగిన అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సీఐటీయు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 48 గంటల వంట వార్పు కార్యక్రమంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సీఎం డౌన్ డౌన్, సీతక్క డౌన్, పోలీస్ జులుం నశించాలి అంటూ నినాదాలు చేస్తూ మేడ్చల్ కలెక్టరేట్ ముందు ఆందోళనకు దిగారు. వేతనాలను ప్రతినెలా ఒకటో తేదీన చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎండాకాలంలో ప్రభుత్వ పాఠశాలతో సమానంగా ఒక పూట బడి, మే నెల అంతా టీచర్, హెల్పర్ ఇద్దరికి సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ నిర్వీర్యం చేసి పీఎం శ్రీ పథకం మొబైల్ అంగన్వాడి సెంటర్స్ ను రద్దు చేయాలని, కేంద్రం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేసిన అంగన్వాడిలు.



అంబర్ పేట్ డివిజన్ గవర్నమెంట్ బాయ్స్ హై స్కూల్ లకోటీయా పాఠశాలలో, గవర్నమెంట్ బాయ్స్ హై స్కూల్ పోలీస్ లైన్ లో చదువుకుంటున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ పూర్ణిమ, ఫార్మసిస్ట్ కావ్య లా ఆధ్వర్యంలో పిల్లలకి కంటి పరీక్షలు నిర్వహించి వారికి కంటి అద్దాలు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎస్.ప్రవీణ్ కుమార్, హెడ్మాస్టర్లు మహేశ్వర్, సుశీలమ్మ, మాధవి అమృత, రజిని, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

*–అంబర్ పేట, మార్చ్ 18 (నిఘా న్యూస్):*

## ఘనంగా రేణు ఆత్మీయ ఫ్రెండ్స్ మెగా ఈవెంట్

### ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన స్నేహితులు



**హైదరాబాద్, మార్చ్ 18 (నిఘా న్యూస్):** రేణు ఆత్మీయ ఫ్రెండ్స్ మెగా ఈవెంట్ – 2025 (సోషల్ మీడియా దిగ్గజాల ఆత్మీయ కలయిక) కార్య క్రమం హైదరాబాద్ నింబోలి అడ్డాలో ని ఏకే ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల నుంచి స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బసీర్ మాస్టర్, యాంకర్ సరిత లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేణు ఆత్మీయ ఫ్రెండ్స్ వ్యవస్థాపకురాలు రేణుకను స్నేహితులంతా ఘనంగా సన్మానించారు.

## అంతరిక్షం నుంచి క్షేమంగా తిరిగి రావాలని విద్యార్థుల ప్రదర్శన

### సునీత విలియం, భారీ విల్మోర్ రాక కోసం ఆక్స్ ఫర్డ్ స్కూల్ బ్యానర్లతో స్వాగతం




**హైదరాబాద్, మార్చి 18 (నిఘా న్యూస్):** సుమారు 8 నెలల పాటు అంతరిక్షంలో చిక్కుకుపోయిన సునీత విలియం, భారీ విల్మోర్ లను ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు తిరిగి భూమికి స్వాగతించే అద్భుత బ్యానర్లను మంగళవారం ప్రదర్శించారు. వారు సురక్షితంగా తిరిగి రావడానికి స్పేస్ ఎక్స్ చేసిన చారిత్రాత్మక ప్రయత్నాలను గౌరవిస్తూ విద్యార్థులు, అధ్యాపకులు ఈ అద్భుత అంతరిక్ష యాత్రను వీక్షించడానికి ఎదురుచూస్తున్నారని స్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ తెలిపారు. వ్యోమగాముల పట్టుదలను, ధైర్యాన్ని వారు ప్రశంసించారు. స్పేస్ ఎక్స్ ఇంజనీర్లు, శాస్త్రవేత్తల అకుంఠిత ప్రయత్నాల వల్ల రెస్క్యూ నౌక వలన ఇది సాధ్యమైనదని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు అంతరిక్ష పరిశోధనల పురోగతి గురించి, శాస్త్ర సాంకేతిక రంగాలను ఎంచుకోవడానికి ఇటువంటి సంఘటనలు వారిని ప్రేరేపించే విధంగా ఉన్నాయని వారు ఉత్సాహంతో తెలియజేశారు. యువ అభ్యాసకులలో అంతరిక్ష శాస్త్రం పట్ల ఉత్సుకతను పెంచడానికి ఈ పాఠశాల ఒక నిదర్శనంగా నిలిచింది. ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన బ్యానర్లతో విద్యార్థుల తల్లిదండ్రులు సెల్ఫీలు దిగి వ్యోమగాములతో కలిసి ఉన్నట్లుగా అనుభూతులను పొందుతున్నారు.

## బిజెపి స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా సుధాకర్



**రాజేంద్రనగర్, మార్చ్ 18 (నిఘా న్యూస్):** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా రాజేంద్రనగర్ నియోజకవర్గం నుండి కాడెం సుధాకర్ ను నియమించారు. ఈ సందర్భంగా కాడెం సుధాకర్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించినప్పటి నుండి పార్టీ కి అంకిత బావంతో దేశం కోసం ధర్మం కోసం పని చేసే పార్టీలో నరేంద్ర మోడీ నాయకత్వం లో పని చేస్తున్నందుకు గర్వంగా ఆనందంగా ఉందని కష్టపడి పని చేసే కార్యకర్తలను గుర్తించి గౌరవించే పార్టీ దేశంలో కేవలం బీజేపీనే అని నాపై ఎంతో నమ్మకంతో రెండవ సారి నన్ను రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా నియమించడం బాధ్యత ను రెట్టింపు చేసింది. రానున్న ప్రతి ఎన్నికల్లో పార్టీ నీ పార్టీ పథకాలను గడప గడపకు చెరుస్తానని యువత ను దేశ అభివృద్ధి, ప్రగతి కోసం ప్రోత్సహిస్తూ మండల నియోజకవర్గ జిల్లా రాష్ట్ర పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

## జాతీయ పోటీలకు ఎన్నికైన సేక్రేడ్ హార్ట్ విద్యార్థులు



**మోత్కూరు, మార్చి 18 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్ సబ్ జూనియర్స్ క్రీడా పోటీలో మోత్కూర్ సెక్రెడ్ హార్ట్ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూలు ప్రిన్సిపాల్ ఫాదర్ ఏం. తానయ్య మాట్లాడుతూ రాష్ట్రస్థాయి త్రోబాల్ సబ్ జూనియర్స్ క్రీడా పోటీలలో క్రీడా నైపుణ్యం కనబరిచిన బాలికల విభాగంలో పి.ప్రియాంక,పి.మేరీ వర్షిత,జి.వర్షిని,బాలుర విభాగంలో కే.హర్షవర్ధన్, ఓ.శివ స్వామి ఈనెల 28,29,30 న చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ తానయ్య,పి.డి.ఎం యాదయ్య, పిఈటిచాంద్ పాషా,ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## 30 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



**మనోహరాబాద్, మార్చి 18 (నిఘా న్యూస్):** మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల కూచారం గ్రామం వద్ద గల పంజాబీ దాబా వద్ద హైదరాబాద్ వైపు నుండి నాగపూర్ వైపు అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం గల లారీని ఎస్ఐ. సుభాష్ గౌడ్ డిపార్ట్మెంట్ మనోహరాబాద్ విజిలెన్స్ డిపార్ట్మెంట్ అధికారులు పట్టుకోవడం జరిగింది. అనంతరం వారిని విచారించగా శ్రీశైలం రోడ్ నుంచి వస్తూ మహారాష్ట్రకు తీసుకొని వెళుతున్నారని వివరించారు. డ్రైవర్, లారీ ఓనర్ పై, పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఓనర్ పై ముగ్గురిపై ఆర్ ఐ. దీక్షిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరుగుతుంది. ఈ లారీలో సుమారుగా 30 టన్నుల పిడిఎస్ రైస్ కలవు. ఈ రైస్ ని సేఫ్ కస్టర్డ్ నిమిత్తం ఎం ఎల్ స్ తూప్రాన్ కి తరలించడం జరిగిందని అధికారులు తెలియజేశారు.

## కళావతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి



**వరంగల్, మార్చి 18 (నిఘా న్యూస్):** నర్సంపేట పట్టణంలో నిరుపేద కుటుంబానికి చెందిన వావిల్ల ఆనంద్ భార్య వావిల్ల కళావతి అనారోగ్యంతో మృతి చెందారు. బీసీ సంక్షేమ సంఘం నర్సంపేట నియోజకవర్గ మహిళా కన్వీనర్ బండి విజయ చెన్నారావుపేట గ్రామ మహిళా అధ్యక్షురాలు ముంజ లక్ష్మి మహిళా ప్రధాన కార్యదర్శి కారుపోతుల శ్రీదేవి లు కళావతి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి విజయ మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలో నిరుపేద కుటుంబమైన వావిల్ల ఆనంద్ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇల్లు కూడా సరిగ్గా లేని కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజయ కోరారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న దానం



**శామీర్ పేట, మార్చి 18 (నిఘా న్యూస్):** శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నదానం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం తరఫున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా శామీర్ పేట గ్రామానికి చెందిన పూర్ణచందర్ – అర్చన దంపతులు,వారి కుటుంబ సభ్యులు, అలాగే ఘట్ కేసర్ కు చెందిన మల్లికార్జున్ గౌడ్ – లక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు హరి చందన, సిరి చందన, స్వామి గౌడ్– లత దంపతులు, వారి కుటుంబ సభ్యులు వర్ష, కీర్తి వారి కుటుంబ సభ్యులు అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## దీన్ దయాల్ కాలనీ అధ్యక్షుడిగా విజయ భాస్కర్ రెడ్డి

### నూతన కార్యవర్గాన్ని ఆశీర్వదించిన కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్




**కూకట్ పల్లి, మార్చి 18 (నిఘా న్యూస్):** ఫతేనగర్ డివిజన్ పరిధిలో దీన్ దయాల్ నగర్ బస్తీ అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయభాస్కర్ రెడ్డి విజయం సాధించారు. కాలనీకి జరిగిన ఎన్నికలలో ప్రధాన కార్యదర్శిగా హరిప్రసాద్, స్థానిక ప్రజలు అధిక మెజారిటీతో గెలిపించారు. వారు కుకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ను కలిసి ఆశీర్వాదం పొందారు. వారితో బండి రమేష్ బస్తి సమస్యల అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టి దీన్ దయాల్ నగర్ ను సుందరంగా తీర్చిదిద్దాలని బస్తి వారి అందరితో సమైక్యంగా కలిసి ఉండాలని బండి రమేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గోవింద్ ,శివా చౌదరి రమణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కరీంనగర్, మార్చి 18 (నిఘా న్యూస్):** ఉమ్మడి జిల్లాలోని బీసీ గురుకులాల్లో 6,7,8,9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మహాత్మా జ్యోతిభాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులాల సంస్థ రీజనల్ కో ఆర్డినేటర్ అంజిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల కోసం మార్చి31 వరకు ఆన్లైన్ ద్వారా మీసేవ కేంద్రాలలో గానీ, %ష్మష.ఎయిజ్ఎష్మతీవఅం.ఎవశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీజ.ఱఅ% వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20 తేదీన ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఇష్టంతో చదివితే విజయం దాసోహం అవుతుంది

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.





**ఏటూరు నాగారం, మార్చి 18 (నిఘా న్యూస్):** విద్యార్థిని విద్యార్థులు చదువుకోవడానికి భయపడవద్దని, ఇష్టంతో కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. మంగళవారం ఏటూరు నాగారం మండలం ఆకుల వారి ఘనపురంలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా విద్యార్థులకు అందిస్తున్న భోజనశాల, వంటగదిని, సరుకుల స్టోరేజీ గదిని తనిఖీ చేశారు. సరుకులను వాటి బ్రాండ్ ను, నాణ్యతను, గడువు తేదీని పరిశీలించారు.వంట గదిలో శుభ్రత పాటించాలని, పరిశుభ్రత, నాణ్యతతో భోజనం తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూ ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నిర్దేశించిన కంపెనీలకు చెందిన స్టాక్ ను మాత్రమే వినియోగించాలని తెలిపారు. భోజనం రుచి, నాణ్యతను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఏ సమయానికి ఏయే ఆహారం ఇస్తున్నారని విద్యార్థులను అడిగారు. కామన్ డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు అన్ని రకాల పోషకాహారంతో కూడిన ఆహారాన్ని అందజేస్తున్నారని తెలిపారు. వివిధ రకాల విటమిన్ల, ప్రోటీన్లతో కూడిన ఈ ఆహారాన్ని ఖచ్చితంగా తీసుకోవాలని తెలిపారు.అనంతరం విద్యార్థులతో ముచ్చటించి మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి సుఖ జీవితం పొందాలంటే విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ప్రతిరోజు నాలుగైదు గంటలు చదువుపై శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతి విద్యార్థి సమయాన్ని వృధా చేయకుండా విద్యను అభ్యసించాలని, తెలియని విషయాలను ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకోవాలని అన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించడానికి నూతన విద్యా బోధన విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. చదువులో రాణిస్తామో, రాణించమనే భయాన్ని తొలగించుకొని, ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు కన్న కలలను విద్యలో రాణించి నిజం చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్లకోమా వ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దు

### కింగ్ కోటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్.రాజేంద్రనాథ్



**హైదరాబాద్, మార్చి 18 (నిఘా న్యూస్):** కంటి చూపును హరించే గ్లకోమా వ్యాధి లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దని కింగ్ కోటి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, కంటి వైద్య విభాగపు అధికారి డాక్టర్ రాజేంద్రనాథ్ వెల్లడించారు. గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకుని వారు మాట్లాడుతూ నగరంలోని కింగ్ కోటి హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని కంటి వైద్య విభాగంలో తన పర్యవేక్షణలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎ. సవిత, కంటి వైద్యాధికారులు కంటి సమస్యలతో ఆసుపత్రిని సందర్శించిన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. కంటి వైద్య విభాగంలోని ఓపి వైద్య విభాగంలో రోజుకు 70 మంది నుండి 100 మంది వరకు కంటి సమస్యలతో ఆస్పత్రికి సందర్శించి వైద్య సేవలు పొందుతున్నారని వెల్లడించారు. అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు సైతం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. శస్త్ర చికిత్స విభాగంలో నెలకు 60 నుండి, 80మంది వరకు కంటి శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన వారికి కంటి ఔషధాలు అందించడంతోపాటు, కళ్ళలో చుక్కల ఔషధం వేసుకోవడానికి చుక్కల మందు పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కంటి ఆరోగ్యం అతి సున్నితమైనది కావున కంటి ఆరోగ్య విషయంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కంటి సంరక్షణ అవసరమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని కోరారు. అయితే గత వారంలో గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 10మందికి గ్లకోమా వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని అన్నారు. ఆ 10 మందికి వ్యాధి పరిశీలన నిమిత్తం, మెరుగైన వైద్యం కొరకు సరోజినీ దేవి కంటి ఆసుపత్రికి వెళ్లాలని సూచించడం జరిగిందని పేర్కొన్నారు. ఎండాకాలం కొనసాగుతుంది కావున ప్రజలు కంటి జాగ్రత్తలు తప్పనిసరి పాటించాలని కోరారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కమిటీలు కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ జి.సంధ్యారాణి



**వరంగల్, మార్చి 18 (నిఘా న్యూస్):** వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం అదనపు కలెక్టర్ ఛాంబర్లో గ్రంథాలయ పర్సన్ ఇంచార్జ్ అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి అధ్యక్షతన జిల్లా గ్రంథాలయ సంస్థ వరంగల్ జిల్లా కమిటీ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ కమిటీ తీర్మానంలో 2025–2026 సంవత్సరానికి బడ్జెట్ అంచనాలను ఆమోదంపై తీర్మానం జరిగింది. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ గ్రంథాలయ పర్సన్ ఇంచార్జ్ జి. సంధ్య రాణి మాట్లాడుతూ జిల్లాలోని 16 గ్రంథాలయాల అభివృద్ధి ,అవి పని చేస్తున్న తీరు కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. ఈ సర్వ సభ్య సమావేశంలో వివిధ శాఖల అధికారులు జిల్లా జిల్లా గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీలు మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలి




### షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్

**శామీర్ పేట, మార్చి 18 (నిఘా న్యూస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను ఉపయోగించుకొని ఎస్సీ వర్గ ప్రజలు సమాజంలో మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించుకొనెందుకు, ఆర్థిక ప్రయోజనాన్ని పొందేవిధంగా అవగాహన కల్పించాలని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కు విచ్చేసిన షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ కు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ విసి హాల్ లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి జాతీయ కమీషన్ డైరెక్టరు జి.సునిల్ కుమార్ తో కలిసి కమీషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్ హాజరయ్యారు. షెడ్యూల్డ్ కులాలకు హక్కుల పరిరక్షణ చట్టం, ఎస్సీలు నిరాదరణకు గురైన సందర్భంలో అనుసరించాల్సిన విధివిధానాలు, బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం కోసం రూపొందించిన చట్టాల అమలు తీరును కమీషన్ సభ్యులు శాఖల వారిగా సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ, వడ్డీ లేని రుణాల పథకాలు ఎస్సీ వర్గాలకు అందేలా ప్రజలలో అవగాహన కల్పించే విధంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలకు ప్రభుత్వం అందించే ఎక్కువ సబ్సిడిరుణాల గురించి ఎస్సీ మహిళలకు అవగాహన కల్పించి పారదృకత పాటిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. పరిశ్రమల శాఖ ద్వారా స్వయం ఉపాధి కై చిన్న కుటీర పరిశ్రమలు నెలకొలిపేందుకు ఔత్సాహిక యువతను ప్రేరేపించాలని సభ్యులు సూచించారు. అదే విధంగా మెడిసిన్, ఇంజనీరింగ్ విద్యార్థులకు అందించే స్కాలర్ షిప్పులు ఆలస్యమైనట్లయితే విద్యార్థుల అడ్మిషన్ లలో ఇబ్బంది కలుగకుండా కాలేజీల యాజమాన్యానికి, స్కాలర్ షిప్ ద్వారా ఫీజు చెల్లిస్తామని లిఖితపూర్వకంగా లేఖలను అందజేయాలని ఎస్సీ అభివృద్ది శాఖ అధికారికి సూచించారు. అనంతరం షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్, జాతీయ కమీషన్ డైరెక్టరు జి.సునిల్ కుమార్లను జిల్లా కలెక్టరు గౌతం శాలువా మెమెంటోలతో సత్కరించారు. ఈ సమావేశంలో మల్కాజ్గిరి, మెడ్చల్ డి సి పిలు పద్మజ, కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, ఆర్డిఓలు శ్యాంప్రకాష్, ఉపేందర్ రెడ్డి, ఎసిపిలు, పోలీసు శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి భరోసా కల్పించిన కార్పొరేటర్



**కూకట్ పల్లి, మార్చి 18 (నిఘా న్యూస్):** 124 డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ లో నివాసం ఉంటున్న ఎమ్.డి.మహబూబ్ పెద్ద కుమారుడు సమీర్ (25) ఈ నెల 11 వ తేదీన కారులో వెళ్తుండగా సంగారెడ్డి ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో చనిపోవడం జరిగింది. డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఇట్టి విషయమై చింతిస్తూ మంగళవారం మహబూబ్ కుటుంబ సభ్యులను వారి ఇంటికి వెళ్లి పరామర్శించడం జరిగింది. ఆక్సిడెంట్ సంగారెడ్డి జిల్లా కొండాపూర్ పరిధికి రావడంతో కార్పొరేటర్ సిఐ కి ఫోన్ చేసి ఆక్సిడెంట్ వివరాలు తెలుసుకున్నారు. చిన్న వయస్సులో వ్యాపారంలో కోటి రూపాయల వరకు కుటుంబానికి సంపాదించిపెట్టిన చెట్టంత కొడుకు పోయి బాధపడుతున్న సమీర్ అమ్మా నాన్నలకు, తమ్ముడు, చెల్లికి కార్పొరేటర్ ధైర్యం చెప్పి. ఎల్లప్పుడూ ఏ ఆపదా వచ్చినా నేనున్నానని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ గుడ్ల శ్రీనివాస్, రవి, ధనుంజయ, మల్లేష్, బాలాజీ నాయక్, బాలు నాయక్, శ్రీనివాస్, రంజిత్, రమేష్ తదితరులు ఉన్నారు.

# అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్



**కూకట్ పల్లి, మార్చి 18 (నిఘా న్యూస్):** 124 ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ లో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించడం జరిగింది. అదేవిధంగా రాజీవ్ గాంధీ నగర్లో ఉన్న అంగన్ వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే అంగన్ వాడి కేంద్రంలో హాజరు పట్టి సరిగ్గా నోట్ చేయడంలేదని, రోజువారి వచ్చే పిల్లలను హాజరుపట్టి లో పొందు పరచాలని, పిల్లలకు శుభ్రమైన భోజనం, గుడ్డు ఇస్తూ చదువు చెప్పాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ గుడ్ల శ్రీనివాస్, రవి, ధనుంజయ, మల్లేష్, బాలాజీ నాయక్, బాలు నాయక్, శ్రీనివాస్, రంజిత్, రమేష్, జానీ, ఖాజా, పద్మ, రేఖ, రైమ, ముంతాజ్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ -1 ఫలితాలలో ర్యాంకు సాధించిన ఎస్ఐకు సన్మానం

### ఇల్లందు డిఎస్పి చంద్ర భాను



**ఇల్లందు, మార్చి 18 (నిఘా న్యూస్):** ఇల్లందు పట్టణంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సందీప్ కుమార్ గ్రూప్ వన్ ఫలితాలలో 502 మార్కులు సాధించి మెరుగైన ర్యాంకు తెచ్చుకున్నందుకుగాను. ఇల్లందు డిఎస్పి ఎన్.చంద్ర భాను ఇల్లందు ఇన్స్పెక్టర్ బి. సత్యనారాయణ. ఎస్ఐ సందీప్ కుమార్ ని సన్మానించి వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పి ఎన్.చంద్ర భాను మాట్లాడుతూ పట్టుదల, కృషి, క్రమశిక్షణ తో మనిషి తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చు అని, ఇల్లందు ఎస్సై సందీప్ కుమార్ నిరూపించారని అన్నారు. పోలీస్ ఉద్యోగం చేస్తూ, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యి గ్రూప్ వన్ లో అత్యధిక మార్కులు సాధించడం అభినందించ తగిన విషయం అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా, సెల్ఫోన్లకు, ఆన్లైన్ బెట్టింగ్లకు అలవాటు పడకుండా ఎస్సై సందీప్ కుమార్ ని ఆదర్శంగా తీసుకొని యువత మంచి ప్రవర్తనతో ఉండి ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగపర్చుకొని భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని డిఎస్పి యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి కార్యాలయ సిబ్బంది సందీప్ కుమార్ ని అభినందించారు.



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బద్దం సంజీవరెడ్డి తండ్రి బద్దం భగవంతు రెడ్డి సోమవారం మరణించగా మంగళవారం ఆయన పార్థివ దేహానికి కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి అనంతరం ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

*-వలిగొండ, మార్చి 18 (నిఘా న్యూస్):*

# విద్యార్థుల అ 'పూర్వ' సమ్మేళనం




**రామడుగు, మార్చి18 (నిఘా న్యూస్):** రామడుగు మండలం గుండి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2004-05 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యార్థులు వారి వారి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పూర్వ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు కర్ర వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ 20 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులంతా కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులందరూ వీలైనంత వరకు సమాజ శ్రేయస్సు గురించి ఆలోచించి ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భగవంతయ్య, పూర్వ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు శ్రీధర్, సురేష్, అబ్దుల్ నబీ, రమేష్, సుజాత, వకుల స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# కుక్కల దాడిలో నష్టపోయిన గొర్రెల కాపరి



**వలిగొండ, మార్చి 18 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం టేకుల సోమారం గ్రామానికి చెందిన పాక రామచందర్ గొర్ల దొడ్డిలోకి సోమవారం అర్ధరాత్రి సమయంలో కుక్కలు దాడి చేసి 14 గొర్లను కొరికి చంపేయడం జరిగింది గొర్ల కాపరి పాక రామచందర్ లక్షా యాభై వేలు నష్టపోయిండని జి ఎం పి ఎస్ జిల్లా అధ్యక్షుడు దయాల నరసింహ మండల కార్యదర్శి బుగ్గ చంద్రమౌళి మాట్లాడుతూ కుక్కల దాడిలో గొర్ల కాపర్లు అనేక గ్రామాలలో లక్షలాది రూపాయలు నష్టపోతున్నారని ఎండనక్క వానన్నక 24 గంటలు సేవ చేస్తూ కుటుంబమంతా గొర్ల మేకల మీద ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఆగమైపోతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం కుక్కలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం గొర్లకు మేకలకు ప్రమాదవశాత్తు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని నరసింహ అన్నారు. కావున ఇప్పటికైనా జిల్లా వ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయని ప్రభుత్వం ఎంక్వయిరీ చేసి నష్టపోయిన గొర్ల కాపల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# రాజానగరం అభివృద్ధికి చంద్రబాబు సహకారం

- **సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని వెల్లడి**
- **ముఖ్యమంత్రిని కలిసిన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల**

**కోరుకొండ, మార్చి 18 (నిఘా న్యూస్):** రాజానగరం నియోజవర్గ అభివృద్ధి సహకరించాలని ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే బలరామకృష్ణ.ఈ భేటీలో ప్రధానంగా పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం భూసేకరణ రైతులకు నష్ట పరిహారం చాలాకాలంగా పెండింగ్ లో ఉంది. వెంటనే పరిహారం చెల్లించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరడమైనది అలాగే- రాజానగరం నియోజకవర్గం కోరుకొండ పరిసర ప్రాంతాల్లో శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం భూములు రిజిస్ట్రేషన్స్ నిలిపివేశారు. కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం పేరుతో కోరుకొండకు చెందిన భూములను నిషేదిత జాబితాలో చేర్చారు. ఇందువల్ల రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం భూములను %-% 22 ఏ (1) సి రిజిస్ట్రేషన్ యాక్ట్ నిషేధం తొలగించమని కోరడమైనది అని తెలిపారు. ఎంతోమంది దాహార్తి తీరుస్తున్న సత్యసాయి త్రాగు నీటి పథకం క్రింద సిబ్బంది వేతనాలు చాలాకాలంగా పెండింగ్ లో ఉన్నాయని, అలాగే పథకాన్ని పటిష్ట పరిచి మంచినీరు అన్ని గ్రామాలకు సవ్యంగా జరిగేలా నిధులు విడుదల చేయాలని కోరడమైనది. రాజానగరం నియోజకవర్గంలో మంచినీరు సమగ్రంగా అందించడానికి రూ.681 కోట్లతో సిపిడబ్ల్యూఎస్ పథకాన్ని మంజూరు చేయాలని ఈ ప్రాజెక్ట్ వల్ల నియోజకర్గం లోని అన్ని గ్రామాల్లో ఇక త్రాగునీటి సమస్య తలెత్తదని వివరించారు. అలాగే తొర్రేడు %-% సీతానగరం ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణంనకు సవరించిన అంచనాలకు తగ్గట్టుగా నిధులు రూ.104 కోట్లు విడుదల చేసి, భూసేకరణ , ఇతర సమస్యలు పరిష్కరించి రోడ్డు పనులు త్వరితగతిని అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సీతానగరం పురుషోత్తపట్నం పంచాయతి రాజ్ రోడ్డును సత్వరం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి రూ.36 కోట్లతో రూపొందించిన డి పి ఆర్ ను ఆమోదించి ఆలయాన్ని అభివృద్ధి సహకరించాలని, జూలై 2024-25 అధిక వర్షాలకు నష్టపోయిన వరి రైతులకు రూ.6.89 కోట్ల ఇన్ పుట్



సబ్సిడీని త్వరితగతిన విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఇళ్ళ స్థలాల నిమిత్తం నియోజకవర్గంలో భూసేకరణ చేసి వారికి సొమ్ము చెల్లించలేదని, బాధిత భూ యజమానులకు డబ్బు చెల్లించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ముఖమంత్రి చంద్రబాబు నాయుడుని కోరడమైనది తెలిపా రూ త్వరలో రాబోయే పుష్కరాలు -2027 పురస్కరించుకొని రాజనగరం నియోజకవర్గానికి ప్రాదాన్యతను ఇవ్వాలని, ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని, సీతానగరం మండలం లో 10 పుష్కర ఘాట్స్ ను అభివృద్ధి చేయాలని కోరడమైనది. బొబ్బిలంక పురుషోత్తపట్నం మధ్య ఏటిగట్టు పటిష్టత, రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయమని విజ్ఞప్తి చేయడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. ఈ భేటీ అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు అని ఎమ్మెల్యే బలరామకృష్ణ తెలిపారు.

# ఓటరు చేతన్యంపై ప్రజా చైతన్య యాత్ర




## బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

**వలిగొండ, మార్చి 18 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, ఎండి. జహంగీర్ లు అన్నారు. ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా కమిటి చేపట్టిన ఓటరు చేతన్యంపై ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా మండలంలో పులిగిల్ల, తుర్కపల్లి, పొద్దుటూరు,సుంకిశాల గ్రామాల్లో జరిగిన బహిరంగ సభల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, ఎండి.జహంగీర్ లు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చాక దేశంలో ధరల పెరుగుదలతో దేశ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మరోవైపు దేశంలో నిరుద్యోగం పెరిగి ప్రజలు కనీసం మూడు పూటల తిండి తినలేని పరిస్థితులు వీరి పాలనలో దాపురించాయని అన్నారు. దేశంలో సంపన్నులకు భారీ రాయితీలు కల్పిస్తూ పేదలపై విపరీతమైన పన్నులు వేస్తుందన్నారు పేదలకు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించ్చిందన్నారు. మహిళలకు 2,500 రూపాయలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతులకు మద్దత్తు ధర ఇవ్వడంలో విఫలమయ్యారని కమ్యూనిస్టుల పాలనలో ఉన్న కేరళలో రైతులకు మద్దతుతో కూడిన ధరను ఇస్తున్నారని రైతుల ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా కేరళ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల కోసం పనిచేసే సిపిఎం నాయకులను ఎన్నుకోవాలని గతంలో సిపిఎం ప్రజాప్రతినిధుల పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని ప్రజలకు ఏ సమస్యలు వచ్చిన వారు అందుబాటులో ఉన్నారని అందుకే ప్రజల కష్ట సుఖాలలో అందుబాటులో ఉంటూ ప్రజలను అంటి పెట్టుకునే ప్రజా నాయకులను ఎన్నుకోవాలని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వందల కోట్ల రూపాయల్ని ఖర్చుపెట్టి ప్రజాసేవ పేరుతో కొంతమంది రాజకీయాలు చేయడానికి ముందుకు వస్తున్నారని డబ్బు,మద్యం, రాజకీయాలను తిరస్కరించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, పిఎన్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు అవ్వారు గోవర్ధన్,జిల్లా కమిటి సభ్యులు మద్దెల రాజయ్య,సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి,జిల్లా కమిటి సభ్యులు గణపతి రెడ్డి, గడ్డం వెంకటేష్,మాజీ సర్పంచ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి,సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు వాకిటి వెంకటరెడ్డి,మెరుగు వెంకటేశం, కందడి సత్తిరెడ్డి,మండల కమిటి సభ్యులు కొండే కిష్టయ్య,దుబ్బ లింగం,భూమి మాదవి,కవిడే సురేష్,శాఖ కార్యదర్శులు బుగ్గ చంద్రమౌళి,పలుసం స్వామి,ఈర్లపల్లి నర్సింహా,శాఖ సహాయ కార్యదర్శులు వేముల నాగరాజు,తుమ్మల నర్సిరెడ్డి, పెద్దబోయిన నర్సింహా,మాజీ సర్పంచ్ లు,ఎంపీటీసిలు, బుగ్గ ఐలయ్య, సల్ల నర్సమ్మ ఐలయ్య, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటపాక శివ ఈర్లపల్లి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# బోయిన్పల్లిలో ఇఫ్తార్ విందుకు హాజరైన కేటీఆర్



**కూకట్ పల్లి, మార్చి 18 (నిఘా న్యూస్):** మంగళవారం సాయంత్రం ఓల్డ్ బోయిన్పల్లి లోని బడే మసీదు వద్ద ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, శంబిపూర్ రాజు కార్పొరేటర్లు నరసింహ యాదవ్ ,జూపల్లి సత్యనారాయణ.. సబియా గౌసుద్దీన్, పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బాబురావు, తూము శ్రవణ్ కుమార్ నాయకులు హాజరైనారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులు కటిక ఉపవాస దీక్షలు ఉండి అల్లాహ్ ను స్మరించుకుంటూ ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాను పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అల్లా దయతో అందరూ కూడా ఆయురారోగ్యాలతో ఉంటూ తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.


# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



**నారాయణపేట, మార్చ్ 18 (నిఘా న్యూస్):** జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మంగళ వారం జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో కలెక్టర్ హౌసింగ్, డి ఆర్ డి ఏ, విద్యాశాఖ, ఆరోగ్య, పీఆర్, డీపీ వో, మున్సి పల్ శాఖల అధికారులతో ఆయా శాఖల ప్రగతి పనుల పై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సొంత స్థలాలు ఉన్న 859 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, వాటిలో ఇంత వరకు ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయని అడిగారు. స్పందించిన హౌసింగ్ పీడీ శంకర్ ఇప్పటి వరకు 165 గ్రౌండింగ్ అయ్యాయని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో రాష్ట్రవ్యాప్తంగా మన జిల్లా 6 వ స్థానంలో ఉందని తెలిపారు. మిగతా ఇండ్ల నిర్మాణాలను కూడా త్వరగా మొదలుపెట్టి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరంగా సెర్ఫ్ కు సంబంధించి మహిళలకు సోలార్ పవర్ ప్లాంట్లు, బస్సులు, న్యూ ఎంటర్ ప్రైజెస్ ఎంత వరకు వచ్చాయని కలెక్టర్ డిఆర్డిఓ మొగులప్ప ను అడిగి తెలుసుకున్నారు. అయితే బ్యాంక్ లింకేజీలో రాష్ట్రంలో మన జిల్లా ర్యాంకు 32 వ స్థానంలో ఉండట%శీ%పై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పనితీరు సరిగ్గా లేని ఏపి ఏం లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిఆర్డిఓ ను ఆదేశించారు. 2025-26 సంవత్సరానికి విద్యార్థులకు పంపిణీ చేసే స్కూల్ యూనిఫాంల కుట్టే ప్రక్రియ పై ఆమె చర్చించారు. 2024-25 లో జరిగిన పొరపాట్లు,లోటు పాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డిఆర్డిఎ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.

## డ్రగ్స్ వద్దు బ్రో పై పోలీసుల అవగాహన



**బెల్లంకొండ, మార్చి 18 (నిఘా న్యూస్):** పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బెల్లంకొండ మండలంలోని "డ్రగ్స్ వద్దు బ్రో" పేరుతో డ్రగ్స్ అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం యువత, ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, చట్టపరమైన పరిణామాల గురించి అవగాహన కల్పించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.ఈ సందర్భంగా మండల ఎస్సై డి.ప్రవీణ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల విపత్తును సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కమ్యూనిటీ నాయకులు కలిసి యువతను సరైన మార్గంలో నడిపించాలని సూచించారు. డ్రగ్స్ సరఫరాదారులపై, వినియోగదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది విద్యార్థులు, స్థానిక ప్రజలు చురుకుగా పాల్గొని డ్రగ్స్-ఫ్రీ సమాజం సాధనకు కృషి చేయాలని అభ్యర్థించారు.

# అర్హత గల పేదవారికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు



**ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

**ఏటూరు నాగారం, మార్చి 18 (నిఘా న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను అర్హత ఉండి పేదవారైన అందరికీ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్ అన్నారు.మండలంలోని ముళ్ళకట్ట గ్రామంలో లబ్ధిదారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు ఐదు లక్షల రూపాయలతో ఇండ్ల నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వం మొదటి విడత ఆరులకు నిధులను కేటాయించిందని, ఐదు లక్షల లోపు ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయడానికి నమూనా ఇంటిని ప్రతి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్మించామని అన్నారు. మొదటి విడత పనులు చేపట్టిన లబ్ధిదారులకు పునాది పనులు పూర్తయిన అనంతరం లక్ష రూపాయలను తమ బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, పిల్లర్లు వేసి స్లాబ్ వేసిన అనంతరం మూడు లక్షల రూపాయలను లబ్ధిదారుల ఖాతాకు జమ చేయడం జరుగుతుందని అన్ని పనులు పూర్తయిన అనంతరం మరో లక్ష రూపాయలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. గతంలో నిర్వహించిన సర్వే సందర్భంగా పేదలకు ఉన్న ఇండ్ల స్థలాల వివరాలను సేకరించడం జరిగిందని, ఇంటి స్థలం లేని లబ్ధిదారులకు మొదటి విడతలో ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. ఇంటి స్థలం ఉండి ఇండ్లు మంజూరు కానీ లబ్ధిదారులు మండల కేంద్రాల్లోని ఎంపీడీవో ను కలిసి వివరించాలని, ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి ఇండ్లు మంజూరు కాని వారికి మొదటి విడతలో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో ఇండ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాంపతి, ఐటిఐ ప్రిన్సిపల్ ఎస్. జగన్ మోహన్ రెడ్డి, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ మోవీన్ కుమార్, సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, ప్రజలు పాల్గొన్నారు.



## గుమ్మడి నరసయ్య నేతృత్వంలో రేవంత్ ను కలిసిన నేతలు

### మంత్రులతో పాటు ఎమ్మెల్యే కోరం, మహబూబాబాద్, డోర్నకల్, వైరా ఎమ్మెల్యేల హాజరు

**ఇల్లందు, మార్చి 18 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అసెంబ్లీలోని తన ఛాంబర్ లో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, అఖిలపక్షం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు సమస్యలను వివరిస్తూ ఎంతో చరిత్ర కలిగిన ఇల్లందును రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలని కోరారు, అలానే కొమరారం,బోడును నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్ట్, గోదావరి జలాలను ఇల్లందు నియోజక వర్గంతో పాటు మహబూబాబాద్,డోర్నకల్ కు అట్టి జలాల నీటిని అందించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని, ఉమ్మడి అఖిలపక్షం ఏర్పాటు ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలను. అధికారు లను పిలిపించి మాట్లాడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు మహబూబాబాద్, డోర్నకల్, వైరా, ఎమ్మెల్యేలు. అఖిలపక్ష నాయకులు దేవరకొండ శంకర్, ఆలేటి కిరణ్, గౌని నాగేశ్వరరావు, ముద్రగడ వంశీ, గోపగాని శంకర్రావు, షేక్ యాకుబ్ శవాలి, బండారు మోహన్ రావు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 15న శ్రీశైలంలో కుంభోత్సవం

### అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



**శ్రీశైలం, మార్చి 18 (నిఘా న్యూస్):** చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ లేదా శుక్రవారం (ఏ రోజుముందుగా వస్తే ఆ రోజు) శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సాంప్రదాయం. ఈ సంవత్సరం ఏప్రిల్ 15న ఈ కుంభోత్సవం నిర్వహించ బడు తుంది. అమ్మవారికి సాత్త్విక బలి నిర్వహించేందుకు (కొబ్బరికాయలు, గుమ్మడికాయలు, నిమ్మకాయలు, మొదలగునవి సమర్పించడం) ఈ కుంభోత్సవం జరిపించడం ఆనవాయితి. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. కాగా ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించడం జరుగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించడం జరిగింది. తరువాత అమ్మవారికి ఈ కొబ్బరికాయలు సమర్పించబడ్డాయి.

## జయ నర్సింగ్ కాలేజీని సీజ్ చేసిన గ్రేటర్ అధికారులు

### మూడేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించని వైనం




**వరంగల్, మార్చి 18 (నిఘా న్యూస్):** గత మూడు సంవత్సరాలుగా మున్సిపల్ కార్పొరేషన్ కు బకాయి పడి ఉన్న ఆస్తి పన్ను రూ 44 లక్షలు చెల్లించని కారణంగా కమిషనర్ ఆదేశాల మేరకు హన్మకొండ లోని జయ నర్సింగ్ కాలేజీని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ జయ నర్సింగ్ కళాశాల యాజమాన్యం కోర్టులో కేసు కొనసాగుతుందని చెబుతూనే నర్సింగ్ కళాశాలను నడుపుతున్నారని గుర్తించిన బల్దియా పన్నుల అధికారులు, బకాయి పడి ఉన్న పన్నులు చెల్లించాలని కోరుతూ రెడ్ నోటీస్ జారీ చేయడం జరిగిందని అయినప్పటికీ ఎలాంటి స్పందన లేక పోవడంతో మంగళవారం నర్సింగ్ కళాశాల విద్యార్థులను సిబ్బందిని బయటికి పంపించి కళాశాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. బల్దియాకు చెందిన అధికారులు గత వారం రోజులుగా ప్రాపర్టీ టాక్స్ చెల్లింపు విషయంలో ఇప్పటికే సుమారు 356ప్రాపర్టీలను సీజ్ చేయడం జరిగిందని నగర ప్రజలు ప్రాపర్టీ, నల్లా బకాయిలు వెంటనే చెల్లించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఓ యూసుఫోద్దిన్ ఆర్ ఐ లు సురేష్ రజని భరత్ చంద్ర శ్రీకాంత్ బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

### పొదుపు వ్యయంపై...

# విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలి

### జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి

**సిద్దిపేట, మార్చి 18 (నిఘా న్యూస్):** సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాన్ఫరెన్స్ హాల్ లో కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్. గోపాల సుదర్శనం రచించిన ఫైనాన్సియల్ లిటరసీ ఆర్థిక అక్షరాస్యత, పుస్తకావిష్కరణ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేటి మార్కెట్ కేంద్రీకృత ఆధునిక ప్రపంచంలో వ్యక్తుల, సంస్థల, వివిధ విభాగాల ఆధాయ వనరులు సమకూరే దారులు, పద్ధతులు పెరుగుతున్నప్పటికీ, అవసరాలను తీర్చుకునే అంశాలలో ఆర్థిక పరిజ్ఞాన లేమితో వెనుకబడడం జరుగుతుందని,రోజు వారి కనీస అవసరాలను తీర్చుకొలేక తడబడుతు అప్పుల ఊబిలోకి లాగ బడుతున్నారని అందుకు గల ప్రధాన కారణం వారిలో 'ఆర్థిక అక్షరాస్యత లోపించడమే అని పేర్కొన్నారు.వ్యయాల నియంత్రణ లేకపోవడం, భవిష్యత్తు అవసరాలను సరిగా అంచనా వేయలేకపోవడం, అత్యాశతో పెట్టుబడు దారుల ఏంపికలో తప్పుటడుగులు వేయడం, మౌలికమైన ఆర్థిక అంశాలలో కనీస పరిజ్ఞానం లోపించడం లాంటివి అటు వ్యక్తుల్లో ఇటు వ్యవస్థల్లో తక్కువ ఆర్థిక అక్షరాస్యత సూచికల అని వివరించారు. బాంకింగ్ పథకాలు, ఆర్థిక సంస్థల విధి విధానాలు, ఇన్స్యూరెన్స్ భీమా, మూల భావనలు, వివిద రకాల పన్నులు, వాటి మదింపు పద్ధతులు, ఆర్థిక సంస్థలు అందించే వివిద ఋణ సౌకర్యాలు, ప్రామాణిక ఆర్థిక సంస్థలు రూపొందించే వనరుల నిర్వహణ అంశాలు, పొదుపు-పెట్టుబడుల విషయంలో విదిగా అనుసరించాల్సిన సూత్రాలను డాక్టర్. గోపాల సుదర్శనం రాసిన ఈ పుస్తకంలో చక్కగా వివరించడం జరిగిందని, ప్రతి ఒక్కరికి తమ నిత్య జీవితంలో తప్పక అవసరమైన ఆర్థిక పరిజ్ఞానాన్ని క్రోడీకరిస్తు ఈ పుస్తకాన్ని రాసిన అధ్యాపకుడిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని పేర్కొంటూ డాక్టర్ గోపాల సుదర్శనం వారు సన్మానించారు.

అధ్యాపకులందరు విద్యార్థులకు చిన్నతనం




నుండే ఆర్థిక క్రమశిక్షణను, పొదుపు ప్రాధాన్యతను, సమర్ధవంతమైన ఆర్థిక ప్రణాళికల తయారి, పెట్టుబడుల ఆవశ్యకతను, నైపుణ్యాల అభివృద్ధి లాంటి అంశాలను సానుకూల దృక్పథంతో బోధిం చాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి.సునీత, మాజీ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి, కళాశాల అకాడమిక్ క్వాలిటీ విభాగం కన్వీనర్ మధుసూదన్, జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## లైంగిక వ్యాధులపై డిగ్రీ విద్యార్థులకు అవగాహన

### సీడీపీవో ఈపి ప్రేమలత

**ఏటూరు నాగారం, మార్చి 18 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో నెహ్రూ యువ కేంద్ర వరంగల్, ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఏటూరునాగారం డిగ్రీ కళాశాల సౌజన్యంతో కస్తూరిబాయి మహిళామండలి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గల డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో మంగళవారం యువతకు లైంగిక వ్యాధులపై అవగాహన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.రేణుక అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఏటూరు నాగారం ఐసీడీస్ ప్రాజెక్టు సీడీపీఓ ఈపి. ప్రేమలత విచ్చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో యువత విలువలతో కూడిన జీవితాన్ని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని,ప్రేమ, వ్యామోహం మాటున యువత చెడు దారిలో పయనించకుండా నిగ్రహశక్తిని పెంపొందించుకొని జీవితంలో స్థిరపడిన తర్వాతనే వివాహం చేసుకొని జీవిత భాగస్వామితో మాత్రమే ఆనందంగా జీవించాలని, లేనిపక్షంలో అపరిచితులతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎయిడ్స్ వ్యాధికి గురయ్యే ప్రమాదం పొంచి ఉందని అన్నారు.అనంతరం విశిష్ట అతిధిగా విచ్చేసిన నెహ్రూ యువ కేంద్ర వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల మాట్లాడుతూ శారీరకంగా



మానసికంగా దృఢంగా ఉండి,ఆరోగ్యవంతమైన సమాజం కోసం యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. తదుపరి దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ రిసోర్స్ పర్సన్ జ్యోతి మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాప్తి మార్గాలు, దాని నివారణ కోసం పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. అదేవిధంగా హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల సమాజం చులకన భావంతో చూడకుండా వారికి ఆత్మీయతను పంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో కస్తూరిబా మహిళా మండలి అధ్యక్షురాలు కొమరగిరి సామ్రాజ్యం, ఎన్ఎస్ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ డా.సిహెచ్. వెంకటయ్య, ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ శ్యామలత, అడ్వకేట్ బానోత్ మహేందర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగము ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్.హరికృష్ణ, డిగ్రీ కళాశాల అధ్యాపకుల బృందం పాల్గొన్నారు.

## ఆర్డీఓ కార్యాలయం ముందు రైతుల ధర్నా

### పట్టా పాస్ బుక్కులు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేత



**అబ్దుల్లాపూర్మెట్, మార్చ్ 18(నిఘా న్యూస్):** అబ్దుల్లాపూర్ మెట్టు మండల పరిధి అనాజ్ పూర్ గ్రామంలో సర్వే నెం.274,275, 276,277, 278, 281లో సుమారు 125 మంది రైతులకు పట్టా పాస్ బుక్కులు ఇవ్వాలని కోరుతూ మంగళవారం ఇబ్రహీంపట్నం ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా చేసి ఆర్డీవో అనంతరెడ్డికి మెమోరండం అందజేశారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య హాజరై మాట్లాడుతూ 1991లో ఆనాటి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు చెందిన అర్హులైన పేదలకు సీలింగ్ పట్టాలు , పాస్బుక్కులు ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం కొత్త పాస్ బుకులు ఇవ్వకుండా ఆ భూమిని పేదల నుంచి గుంజుకుని బడా బాబులకు కట్ట పెట్టాలని చూసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందే అసైన్డ్ , పొరంబోకు, సీలింగ్ భూములకు పట్టాలు ఇస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట మర్చిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పేదల నుండి ఈ భూములను గుంజుకుని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పా లని చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి ఈ భూమిని నమ్ముకుని జీవిస్తున్న పేదలకు పట్టా పాస్బుక్కులు ఇచ్చి రైతు భరోసా రైతు బీమా ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏర్పుల నరసింహ డిమాండ్ చేశారు. లేని యెడల ఆ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు వర్కల ముత్యాలు,కావాలి జంగయ్య, మహే శ్వరం లింగస్వామి, రైతులు బిక్షపతి గౌడ్ మహేష్ గౌడ్,రాములు, మహేష్, యాదయ్య, రంగయ్య, రవికుమార్, పాల్గొన్నారు.

## నిమ్జ్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

- నిమ్జ్ పూర్తయితే జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.
- కలెక్టరేట్‌లో రెవిన్యూ, నిమ్జ్ ప్రత్యేక అధికారితో కలెక్టర్ సమీక్ష

**సంగారెడ్డి, మార్చ్ 18(నిఘా న్యూస్):** జిల్లాలో కేంద్ర రాష్ట ప్రభుత్వా లు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిమ్జ్ ఏర్పాటు కోసం అవసరమైన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో నిమ్జ్ ప్రత్యేక అధికారి రాజు, జహీరాబాద్ ఆర్డీవో, తహసిల్దార్ లతో కలెక్టర్ నిమ్జ్ కోసం భూసేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిమ్జ్ ఏర్పాటుతో మారుమూల ప్రాంతాలైన జహీరాబాద్ నియోజకవర్గాల రూపురేఖలు మారిపోతాయని పేర్కొన్నారు. నిమ్జ్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నిమ్జ్ ఏర్పాటుకు భూములు ఇచ్చిన వారికి నష్టపరిహారం అందించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విషయంపై ఆయా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా అధికారులు చర్యలు



చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు ఆయా మండలాలలో గ్రామాల వారీగా చేసిన భూసేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎంత సేకరణ చేయాల్సి ఉంది అన్న వివరాలను ఆయా మండలాల రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాలలో ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పనులు వేగవంతంగా చేసి నిమ్జ్ ప్రాజెక్టు సకాలంలో ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్డిఓ రామ్ రెడ్డి, తహసిల్దార్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఒక్క పాస్ బుక్కుతో... మూడు ఫేక్ డాక్యుమెంట్లు

### అక్రమాలకు అడ్డాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

**తూప్రాన్, మార్చి 18 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ లోని రావెల్లి శివారులోని 97 సర్వే నెంబర్ లోని 4 గుంటల భూమిని ఆంధ్ర ప్రదేశ్ గత పాసు బుక్ ను ఉపయోగించి పలు రకాలుగా ఆవిష్కరించి మూడు డాక్యుమెంట్స్ ను తయారు చేసిన సబ్ రిజిస్ట్రార్



ఆఫీసర్లు. బాధితుడు బూర్గుల గోవర్ధన్ రెడ్డి లబోదిబో మంటూ విలేకర్లను ఆశ్రయించడం జరిగింది. దీనిపై సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ను సందర్శించి సబ్ రిజిస్ట్రార్ రాకపోవడంతో జూనియర్ అసిస్టెంట్ ను వివరణ కోరగా తిరస్కరించిన వైనం. ఈ సందర్భంగా బాధితుడు విలేకరులతో మాట్లాడుతూ తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో రెండు హౌస్ నెంబర్లను సేకరించి రెండు డాక్యుమెంట్స్ తయారు చేయడంతో పాటు, నాలా కన్వెన్షన్ ద్వారా మరొక డాక్యుమెంట్ ను తయారు చేశారు. గతంలో ఇలాంటి అక్రమాలు చేయడంతో సబ్ రిజిస్ట్రార్ పై కేసు నమోదు కావడంతో పాటు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. అధికారులు ఇలాంటి అక్రమాలకు పాల్పడుతూ భూములను పలు పర్యాయాలు డాక్యుమెంట్ తయారు చేయడంపై ప్రజలు ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మహేశ్వరంలోని అన్ని గ్రామాలను ఫోర్త్ సిటీలో కలపాలి

### ఫోర్త్ సిటీ ఉద్యమ జేఏసీ ఏర్పాటు చైర్మన్‌గా ఎన్నికైన రఘుపతి

**మహేశ్వరం, మార్చి 18(నిఘా న్యూస్):** మహేశ్వరంలోని అన్ని గ్రామాలను ఫోర్త్ సిటీలో కలిపేంత వరకు పోరాటం చేస్తామని ఫోర్త్ సిటీ జేఏసీ చైర్మన్‌గా ఎన్నికైన రఘుపతి అన్నారు. మహేశ్వరం మండల కేంద్రంలో రాజకీయ పార్టీల నాయకులు మహేశ్వర మండలాన్ని ఫోర్త్ సిటీలో కలిపేలా పోరాటం చేయాలని కార్యాచరణ రూపకల్పన కోసం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమా వేశానికి వచ్చిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీఎస్పి, సిపిఐ సిపిఎం తదితరుల అభిప్రాయాలను తీసుకున్నారు. అనంతరం కమిటీని ఏర్పాటు చేశారు.ఫోర్ సిటీ జేఏసీ చైర్మన్‌గా రఘుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అన్ని పార్టీల నుంచి నాయకులను కమిటీలోకి తీసుకున్నారు. చైర్మన్ గా ఎన్నికైన రఘుపతిని ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రాత్మకమైన మహేశ్వరం మండల ప్రాంతం అన్ని రంగాల్లో వెనకబడి ఉందన్నారు. మనలో ఐక్యత లోపం నిర్లక్ష్యం కారణంగా మన కళ్ళముందే మన ప్రాంతంలో ఉన్న వివిధ పార్టీ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మనకు పదవులు



ముఖ్యం కాదు ప్రాంతం ముఖ్యమన్నారు. మన మహేశ్వరానికి అన్యాయం జరగబోతుం దన్నారు. ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలా వద్దా అనే అంశాన్ని చర్చించడం జరిగింద న్నారు. మన ప్రాంతానికి చెందిన దోమ యాదగిరి రెడ్డి మన ప్రాంతం గురించి మన ప్రాంతాన్ని ఎలా కాపాడుకోవాలి అనే అంశాన్ని గురించి మాట్లాడడం జరిగిందన్నారు. ఈ ప్రాంతానికి ఎక్కడ వాళ్లు ఎక్కడి నుంచి వచ్చారు. మన ఓట్లు వేసుకొని ఉన్నత పదవులు పొంది మన ప్రాంతానికి నష్టం చేశారని బాధతో ఆవేదనతో చెప్పడం జరిగింది అన్నారు. సుభాన్ పూర్ గోపాల్ రెడ్డి మన ప్రాంతం గురించి మాట్లాడే వ్యక్తి చూసిన అనంతరం ప్రస్తుతం యాదగిరి రెడ్డిని చూస్తున్నామన్నారు. పోరాటానికి సహకారం తెలుపుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. చీము నెత్తురు ఉన్న ప్రతి పార్టీ నాయకుడు కార్యకర్తలు ఫోర్త్ సిటీలో మన మండలాన్ని కలిపేంతవరకు పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. పోలీసులతో దెబ్బలు తిన్నా, కేసులు పెట్టి జైలుకు పంపించినా సరే మన ప్రాంత అభివృద్ధి కోసం మండల కేంద్రంలోని 32 గ్రామాలను ఫోర్త్ సిటీలో కలిపేంత వరకు పోరాటం ఆపేది లేదన్నారు. ప్రాంత అభివృద్ధి కోసం ఎంతవరకు అయినా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు. కర్నాటి మనోహర్ ,యాదేశ్ , కాకీ ఈశ్వర్ ముదిరాజ్. తదితరులు పాల్గొన్నారు .

### నిరుద్యోగులు యువ వికాస పథకాన్ని

# ఉపయోగించుకోవాలి

### తెలంగాణ రాష్ట్ర బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్

**హైదరాబాద్, మార్చి 18 (నిఘా న్యూస్):** యువ వికాస పథకాన్ని ఉపయోగించుకుని యువత ఉపాధి కల్పించుకోవాలని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి నిరుద్యోగ యువతకు వినూత్న పథకాలు ప్రవేశపెట్టాలని చేస్తున్న కృషిలో భాగంగా 'రాజీవ్ యువ వికాసం' అనే వినూత్న కార్యక్రమాన్ని అమల్లోకి తేవడం హర్షణీయం అని పేర్కొన్నారు. మంగ ళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి రాజీవ్ యువ వికాస్ పథకం ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ పథకం కింద నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించడానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ రుణం మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం,




ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ నెంబర్, పాస్పోర్ట్ ఫోటో మొబైల్ నెంబర్లు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ నిరుద్యోగు లకు, యువ వికాసానికి మార్చి17 నుండి ఏప్రిల్4 వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగు తుందని అన్నారు. ఏప్రిల్ 6 నుండి 30 వరకు లబ్ధిదారుల ఎంపిక యూనిట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నా రు.క్యాటగిరి 1లో లక్ష వరకు రుణం 80శాతం రాయితీ,క్యాటగిరి రెండులో రెండు లక్షల వరకు సహాయం 70శాతం రాయితీ, మూడవ కేటగిరిలో మూడు లక్షల వరకు సహాయం 60శాతం రాయితీ,కల్పించడం జరుగుతుందని అన్నారు.ఈ సమావేశంలో టిపిసిసి ఓబిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌంటి విక్రమ్ యాదవ్, ఓబీసీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ దేశ బోయిన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com